ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 1 నవంబరు 2025

వైద్యుడి వక్రబుద్ధి

ఏఎంసీ పరిధిలోని ఓ బోధనాస్పత్రిలో ఉన్నతాధికారి అడ్డగోలు వ్యవహారాలు

- వైద్యులు, పీజీ విద్యార్థినులు, నర్సింగ్ సిబ్బందిని లైంగికంగా వేధిస్తున్నట్టు ఆరోపణలు
- ఆయన వ్యవహారశైలి అత్యంత జుగుప్సాకరమంటున్న సిబ్బంది

· 8లో

ముంపులోనే పొలాలు

లోతట్టు ప్రాంతాల్లో నెమ్మదిగా తగ్గుతున్న వరద

- నేటికి పరిస్థితి మెరుగుపడొచ్చని ఆశాభావం
- ఆలస్యమైతే వరి పైరు కుళ్లిపోతుందని రైతుల ఆవేదన



చోడవరం మండలం చాకిపల్లి ప్రాంతంలో శుక్రవారం కూడా ముంపులోనే వున్న వరి పొలాలు

చోడవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): **తుఫాన్ ప్రభావం పూర్తి తగ్గిపోవడంతో పాటు, వాతావరణం తెరిపివ్వడంతో శుక్రవారం ఉదయానికి శారదా, పెద్దేరు నదుల్లో వరద ఉధృతి తగ్గింది. అయితే లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లో వరద నీరు ఇంకా పూర్తిగా తొలగలేదు. పొలాల్లో నుంచి చాలా నెమ్మదిగా నీరు బయటకు వెళుతుండడంతో రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. శనివారంలోగా ముంపు తొలిగితే పంట నష్టం అంతగా వుండకపోవచ్చని భావిస్తున్నారు.**

తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతోపాటు రైవాడ, పెద్దేరు, కోనాం రిజర్వాయర్ల నుంచి భారీగా వరద నీటిని దిగువకు విడచిపెట్టడంతో నదులు ఉప్పొంగి చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాల్లోని పలు గ్రామాల్లో వరి, చెరకు, కూరగాయ పంటలు నీటమునిగిన సంగతి తెలిసిందే. గురువారం సాయంత్రం నుంచి వర్షం పడకపోవడంతో అధికారులు ఆయా రిజర్వాయర్ల నుంచి వరద నీటి విడుదలను క్రమేపీ తగ్గించారు. దీంతో ... మిగతా 8వ పేజీలో



పూడిమడక వద్ద వరద ముంపులో ఉప్పుగల్లీలు

యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చివేత పనులు: కలెక్టర్



గండిపడిన ప్రదేశంలో ఇసుక బస్తాలు వేయడానికి రక్షణ చర్యలు చేపడుతున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఎలమంచిలి/రాంబిల్లి, అక్టోబరు 31: మేజర్ శారదా నది గట్టుకు పడిన గండి పూడ్చివేత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గండిపూడ్చి వేత పనులను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గండి పూడ్చివేత కోసం 35 వేల ఇసుక బస్తాలను రాంబిల్లి మండలం నారాయణపురం వద్ద సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. కాగాద నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కూలీలతో బస్తాల్లో నింపిస్తున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా నది గట్టుకు గండి పడిన ప్రదేశానికి తరలిస్తున్నారు. అక్కడ ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పర్యవేక్షణలో కూలీలతో ఇసుక బస్తాలను వేయిస్తున్నారు.

2 వేల హెక్టార్లలో పంట నష్టం

- 100 హెక్టార్లలో ఉద్యాన పంటలకు...
- హోం మంత్రి అనిత
- రజాల వద్ద శారదా నది గట్టు గండి పరిశీలన
- శాశ్వత మరమ్మతులకు రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు

రాంబిల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా జిల్లాలో రెండు వేల హెక్టార్లలో వ్యవసాయ పంటలకు, 100 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. మండంలోని రజాల అగ్రహారం వద్ద శారదా నది గట్టుకు గండి పడిన ప్రదేశాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మేజర్ శారదా నది గట్టుకు గండి పడడం వల్ల సుమారు 400 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. నదిని ఆనుకొని ఆయిల్‌పామ్ తోటలో చిక్కుకున్న నలుగురిని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించారని చెప్పారు. సుమారు 35 వేల ఇసుక బస్తాలను సిద్ధం చేసి గండి పూడ్చివేత పనులు మొదలుపెట్టినట్టు వెల్లడించారు. శారదా నది గట్టుకు గండి పడిన ప్రదేశంలో శాశ్వత పనుల కోసం రూ.2.5 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు ... మిగతా 8వ పేజీలో



శారదా నది గట్టుకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి కలెక్టర్‌తో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత.

సహాయక చర్యలు ముమ్మరం

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

- బాధితులకు ఉచితంగా రేషన్ పంపిణీ
- మత్స్యకారులు, చేనేత కార్మికులకు బియ్యం 50 కిలోలు, కిలో చొప్పున కందిపప్పు, పంచదార, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, వంట నూనె
- పునరావాస కేంద్రాల్లోని వారికి 25 కిలోల బియ్యం, కిలో చొప్పున పంచదార, కందిపప్పు, ఉల్లి, బంగాళాదుంపలు



ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలో తుఫాన్ బాధితులకు ఉచిత సరుకులు పంపిణీ చేస్తున్న హోం మంత్రి అనిత

అనకాపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలను ప్రభుత్వ యంత్రాంగం ముమ్మరం చేసింది. ఈదురు గాలుల కారణంగా నేలకొరిగిన చెట్ల తొలగింపు దాదాపు పూర్తయ్యింది. లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరద నీటిని తొలగింపు పనులు జోరందుకున్నాయి. చెట్లు పడడంతో విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. ఒరిగి విద్యుత్ స్తంభాలను, తెగిన విద్యుత్ తీగలను సరిచేస్తున్నారు. ఈ పనులు చాలా వరకు తుది దశకు చేరాయి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి, ఇళ్లు దెబ్బతిన్న వారికి, మత్స్యకార కుటుంబాలకు, చేనేత కార్మికులకు ఉచిత రేషన్ అందజేస్తున్నారు. 18,633 మత్స్యకార కుటుంబాలకు, 2,985 చేనేత కుటుంబాలకు బియ్యం 50 కిలోలు, కందిపప్పు, పంచదార, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు ఒక్కో కిలో చొప్పున, ఒక లీటరు వంట నూనె పంపిణీ చేస్తున్నారు. ఇక పునరావాస కేంద్రాల్లో వున్న వారికి, ఇళ్లు దెబ్బతిన్న వారికి 25 కిలోల బియ్యం, కిలో పంచదార, కిలో కందిపప్పు అందజేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని రేషన్ డిపోల్లో శుక్రవారం ఉదయం ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పంపిణీని ప్రారంభించారు.

హోం మంత్రి అనిత పర్యటన

రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించి తుఫాన్ నష్టాన్ని పరిశీలించారు. ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలో పలువురి ఇళ్లకు వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత నిత్యావసర సరుకులను అందజేశారు. ఎంపీ సీఎం రమేశ్ కశింకోట, అనకాపల్లి, రాంబిల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఉచిత రేషన్ పంపిణీ చేశారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

తుఫాన్ కారణంగా జిల్లాలో పలు రంగాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి నుంచి ఎక్కడా వర్షం పడకపోవడం, నదుల్లో వరద ఉధృతి క్రమంగా తగ్గుతుండడంతో శుక్రవారం సహాయ, పునరుద్ధరణ పనులను ముమ్మరం చేశారు.

మునగపాకకు వరద

ఆవ కాలువ గేట్లకు అడ్డంగా చిక్కుకున్న తూటుకాడ

- అర్ధరాత్రి గ్రామాన్ని చుట్టుముట్టిన నీరు
- నడుంబిగించిన రైతులు.. తూటుకాడ తొలగింపు



ఆవ కాలువలో తూటుకాడను తొలగిస్తున్న రైతులు (ఇన్‌సెట్‌లో) తొలగించకముందు కాలువ గేట్లుకు అడ్డంగా చిక్కుకున్న తూటుకాడ

మునగపాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మునగపాకను గురువారం అర్ధరాత్రి చుట్టుముట్టిన వరదతో ప్రజలు ఆందోళన చెందారు. సాయంత్రం వరకు అనకాపల్లి ఆవ కాలువలో సాధారణంగా వున్న వరద ప్రవాహం శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఒక్కసారిగా పెరిగింది. ఈ సమయంలో ములబందగోడిలో ఉన్న పశువుల పాకకు వెళ్లిన ఒక రైతు.. ఆవ కాలువలో వరద నీరు గట్టుపైనుంచి పొర్లి పొలాల్లోకి వెళ్లడాన్ని గమనించారు. వెంటనే సహచర రైతులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో నిద్ర లేచిన రైతులు, పశువులను సురక్షిత ప్రదేశానికి తీసుకువెళ్లడానికి కల్లాల వద్దకు బయలుదేరారు. అదే సమయంలో వరద నీరు శెట్టిబలిజ, జగనన్న కాలనీ, వినాయక మందిర ప్రాంగణం, సంత ప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చింది. చాకిరేవు వద్ద సాగునీటి కాలువ గేట్లకు తూటుకాడ అడ్డుపడడంతో నీరు వెనక్కుతన్ని గ్రామంలోకి వస్తున్నట్టు గుర్తించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు ఎక్స్‌కవేటర్, క్రేన్‌ను రప్పించారు. కానీ తూటుకాడ తొలగించడానికి వీలుకాలేదు.



శెట్టిబలిజ కాలనీలోకి వచ్చిన వరద నీరు

ఇంతలో తెల్లవారింది. రైతులు తాళ్ల సాయంతో ఆవ కాలువలోకి తూటుకాడను తొలగించారు. రెండు, మూడు గంటలపాటు శ్రమించిన తరువాత వరద నీరు సాఫీగా ముందుకు ప్రవహించింది.

నూకాంబిక ఆలయానికి నూతన పాలకవర్గం

- చైర్మన్‌గా పీలా నాగశ్రీను



పీలా నాగశ్రీను, చైర్మన్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయానికి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ దేవదాయ శాఖ అధికారులు శుక్రవారంఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా పీలా నాగశ్రీను, సభ్యులుగా సూరే సతీశ్‌కుమార్, మారిశెట్టి శంకరరావు, పొలిమేర స్వాతి, కాండ్రేగుల రాజారావు, కోనేటి సూర్యలక్ష్మి, వడ్డాది మంగ, దాడి రవికుమార్, మజ్జి జానకి, కొడుకుల శ్రీకాంత్, యర్రవరపు సంతోషికుమారి నియమితులయ్యారు. త్వరలో మంచి ముహూర్తం చూసుకుని ప్రమాణస్వీకారం చేస్తామని నూతన చైర్మన్ నాగశ్రీను చెప్పారు.

ఐక్యతా స్ఫూర్తికి వల్లభ్‌భాయ్ పటేల్ ఆదర్శం

- ఎంపీ సీఎం రమేశ్
- ఘనంగా 'సర్దార్' 150వ జయంతి ఉత్సవాలు

అనకాపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఐక్యతా స్ఫూర్తికి దివంగత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఆదర్శమని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఐక్యతా మార్చ్ పేరుతో నెలరోజులపాటు వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాడి రత్నాకర్, బొడ్డేడ నాగేశ్వరరావు, రత్నభరత్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి జోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ సీఎం రమేశ్. చిత్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, టీడీపీ నేత దాడి రత్నాకర్ ఉన్నారు.

రిజర్వాయర్	గరిష్ఠ నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం	ఇన్‌ఫ్లో క్యూసెక్కులు	అవుట్‌ఫ్లో క్యూసెక్కులు
రైవాడ	114 మీటర్లు	112 మీటర్లు	3,000	50
కోనాం	101.25 మీటర్లు	98.8 మీటర్లు	300	300
పెద్దేరు	137 మీటర్లు	134.25 మీటర్లు	620	700
తాండవ	380 అడుగులు	378.2 అడుగులు	940	270
కల్యాణపులోవ	460 అడుగులు	459.02 అడుగులు	280	280

రిజర్వాయర్లకు తగ్గిన వరద

తాండవ, రైవాడ గేట్లు మూసివేత

- పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ జలాశయాల నుంచి నీరు విడుదల
- శారదా నదిలో వరద తగ్గుముఖం



అనకాపల్లి వద్ద తగ్గిన శారదా నది వరద ప్రవాహం. (ఇన్‌సెట్‌లో) గురువారం శివాలయం గోడను తాకిన శారదా నది వరద

అనకాపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గిపోవ డంతో శుక్రవారం జిల్లాలో ఎక్కడా వర్షం కురవలేదు. గత రెండు, మూడు రోజులతో పోలిస్తే జలశయాల్లోకి వరద పోటు తగ్గింది. దీంతో తాండవ, రైవాడ స్పిల్‌వే గేట్లను మూసివేశారు. ఆయకట్టుకు తాండవ నుంచి 270 క్యూసెక్కులు, రైవాడ నుంచి 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఇక కోనాం జలాశయం స్పిల్‌వే గేట్ల నుంచి 300 క్యూసెక్కులు, పెద్దేరు స్పిల్‌వే గేట్ల నుంచి 700 క్యూసెక్కులు, కల్యాణపులోవ స్పిల్‌వే గేట్ల నుంచి 280 క్యూసెక్కుల నీటిని నదుల్లోకి విడుదల చేస్తున్నారు. గురువారంతో పోలిస్తే దాదాపు అన్ని నదుల్లో శుక్రవారం వరద ఉధృతి తగ్గింది. ముఖ్యంగా శారదా నది ఒకింత శాంతించడంతో ఇరువైపులా వున్న గ్రామాల రైతులు, ప్రజలు ఊరట చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని పొలాల్లో నుంచి వరద నీరు ఇప్పుడిప్పుడే బయటకు పోతున్నది. దీంతో వరి పంటకు పెద్దగా ... మిగతా 8వ పేజీలో

సాయి శ్రేయాస్‌కు మళ్లీ అనుమతులు

ఫార్మా కంపెనీలో ఇరవై రోజుల క్రితం ఉత్పత్తి పునఃప్రారంభం

- జూన్ 11న విష వాయువులు పీల్చి ఇద్దరు ఉద్యోగులు మృతి
- ప్రమాదం జరిగిన 75 రోజులకు కమిటీ నియామకం
- వ్యవస్థాగత లోపాలపై కానరాని అధ్యయనం
- నివేదికపై హెచ్‌ఆర్‌ఎఫ్ అభ్యంతరాలు



విషవాయువులు వెలువడిన ట్యాంకర్లు ఇవే (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) ఇద్దరు ఉద్యోగుల ప్రాణాలు బలిగొన్న పరవాడ ఫార్మా సిటీలోని సాయి శ్రేయాస్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీలో మళ్లీ ఉత్పత్తి మొదలైంది. ఆ కంపెనీలో ఈ ఏడాది జూన్ 11వ తేదీ రాత్రి విషవాయువులు పీల్చి విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులు మరణించిన సంగతి తెలిసిందే. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిపోయిన వారిని తిరిగి వెనక్కి రప్పించి వారి ప్రాణాలు పోవడానికి యాజమాన్యం కారణమైందని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులు కంపెనీలో ఏవీ నిబంధనల ప్రకారం జరగడం లేదని, ఉత్పత్తులకు సంబంధించి సరైన రికార్డులు నిర్వహించడం లేదని గుర్తించి అదే విషయం ప్రభుత్వానికి నివేదించారు. దాంతో కంపెనీని మూసివేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం నియమించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ప్రమాద మూలాల జోలికి పోకుండా నివేదిక ఇవ్వడంతో మళ్లీ మందుల తయారీకి అనుమతులు ఇచ్చారు. ఇరవై రోజుల క్రితం అక్కడ ఉత్పత్తి ప్రారంభమైంది. దీనిపై మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

ప్రమాదం జరిగిన 75 రోజుల తరువాత కమిటీ ఏర్పాటు

ఏదైనా ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగితే దానికి కారణాలు తెలుసుకోవడానికి వెంటనే కమిటీలు వేస్తారు. అప్పుడే వాస్తవాలు బయటకు వస్తాయి. కానీ సాయి శ్రేయాస్ విషయంలో కావాలనే జాప్యం ... మిగతా 8వ పేజీలో

బాధితులను ఆదుకునేందుకు ప్రణాళిక

▸▸ రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



మునగపాక తంపరమూల ప్రాంతంలో చిరు వ్యాపారులతో మాట్లాడిన ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని రహదారులు అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో వరదనీటి ముంపునకు గురైన శెట్టి బలిజ, దళిత, జగప్పగారి ఇస్త్రవ జగనన్న కాలనీలో శుక్రవారం పర్యటించారు. పలువురు వ్యాపారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. పర్యటించిన వారిలో గవర, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీను, డొక్కా నాగభూషణం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, దాడి శివ తదితరులు ఉన్నారు. తహశీల్దార్ పి.సత్యనారాయణతో కలిసి టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి గణేష్ సహాయక చర్యలను పరిశీలించారు. వైసీపీ అనకాపల్లి పార్లమెంటునియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, సీపీఎం నాయకులు కూడా ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

ఏపీఆర్‌డీసీ డైరెక్టర్‌గా శ్యామ్ నియామకం



బొండల శ్యామ్

అచ్యుతాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురానికి చెందిన బొండల శ్యామ్ (జనసేన)కు రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించింది. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. మండలంలోని దుప్పితూరుకి చెందిన ప్రగడ నాగేశ్వరరావు ఏపీఆర్డీసీ చైర్మన్ కాగా, అచ్యుతాపురానికి చెందిన శ్యామ్‌కి డైరెక్టర్ పదవి దక్కింది. ఒకే కార్పొరేషన్‌లో మండలానికి చెందిన ఇద్దరికి పదవులు దక్కటం పట్ల కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'మనడబ్బులు-మన లెక్కలు' యాప్‌పై శిక్షణ

అచ్యుతాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డ్వాక్రా మహిళల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన మనడబ్బులు- మనలెక్కలు యాప్‌పై స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం శిక్షణ అందజేసినట్టు వెలుగు ఏపీఓ శ్రీనివాస రావు తెలిపారు. డ్వాక్రా సంఘ మహిళల మెరుగైన జీవనోపాధి కోసం ప్రభుత్వం ఈ యాప్‌ని రూపొందించింది, దీని వినియోగం మహిళలకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీ రమణ, రమేశ్, నాగరాజు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబు

▸▸ నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి



బియ్యం, సరకులు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ బుజ్జి

నక్కపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నాడు హుద్‌హుద్.. నేడు మొంథా తుఫాన్.. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆపద్బాంధవుడిగా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఎనలేని భరోసా కల్పిస్తున్నారని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అభిప్రాయపడ్డారు. ఉపమాక పంచాయతీ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన తుఫాన్ సహాయక సరకులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం బుజ్జి మాట్లాడుతూ కష్టకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వుండడం ప్రజల అదృష్టమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సీఎం చంద్రబాబు ఆలోచనలు ఇతర రాష్ట్రాలకే ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని చెప్పారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ప్రజలను, అధికారులను అప్రమత్తం చేయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. మండలంలోని పలు మత్స్యకార గ్రామాల్లో కూడా లబ్ధిదారులకు తహశీల్దార్ నరసింహమూర్తి, అధికారులు, నాయకులు సరకులు అందజేశారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

▸▸ జిల్లా పంచాయతీ అధికారి సందీప్



పారిశుధ్యం గురించి మహిళలను అడిగి తెలుసుకుంటున్న డీపీవో

పాయకరావుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కంటోన్మెంటు, బృందావనం, తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడి పారిశుధ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికపుడు రోడ్లపై చెత్త, చెదారాలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వర్షం నీరు నిలువ లేకుండా చూడాలని బ్లీచింగ్ చల్లించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని డీపీవో ఆదేశించారు. రక్షిత నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్, కార్యదర్శి వైవీ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామంలో ఇంటి దారి విషయమై గొడవపడి కత్తితో దాడి చేసిన వ్యక్తికి ఎలమంచిలి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. మాసాహెబ్‌పేట గ్రామానికి చెందిన బంటుపల్లి అయ్యారావు, తిరంశెట్టి సత్యనారాయణ గురువారం ఇంటి దారి విషయమై గొడవ పడ్డారని, అయ్యారావుపై కత్తితో సత్యనారాయణ దాడి చేసి పారిపోయాడని చెప్పారు. శుక్రవారం సత్యనారాయణను పట్టుకుని అరెస్టు చేశామన్నారు. ఎలమంచిలి కోర్టులో ఆయన్ను హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించి వైజాగ్ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఆయన తెలిపారు.



రజాల సమీపంలో కోతకు గురైన శారదా నది గట్టుకు దగ్గరుండి ఇసుక బస్తాలు వేయిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు



వైలోవ గ్రామం సమీపంలో జోరుతగ్గిన మేజర్ శారదా నది

తగ్గిన నదుల ఉధృతి.. వీడిన భయం

▸▸ బలహీన గట్లు వద్ద ఇసుక బస్తాలు వేయించిన ఎమ్మెల్యే విజయకుమార్

▸▸ వరద నీటిలో ఇంకా కొన్ని ఇళ్లు, ఆక్వా చెరువులు

రాంబిల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు, నారాయణపురం గ్రామాల పరిధిలోగల మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ప్రభావిత గ్రామాల రైతులు ఆందోళన వీడారు. తుఫాన్ నేపథ్యంలో నదుల్లో నీటి ఉధృతికి రజాల అగ్రహారం, నారాయణపురం సమీపంలో నదుల గట్లకు గండి పడి రైతులు పంటపొలాలు, ఆక్వాచెరువులు ముంపునకు గురైన విషయం తెలిసిందే. శుక్రవారం నదిలో నీటి తగ్గుముఖం పట్టడంతోపాటు, ఆక్వా చెరువులు, పలుచోట్ల పంట పొలాలు తేరుకున్నాయి. కొన్నిచోట్ల ఇంకా ముంపులోనే ఉన్నాయి. మేజర్ శారదానది తగ్గుముఖం పట్టడంతో వైలోవ గ్రామంలో బాధిత కుటుంబాలువారు ఊపిరి పీల్చుకున్నాయి. నారాయణపురం వద్ద కెనరాబ్యాంక్ సమీపంలోని కొన్ని ఇళ్లు నీటి ముంపులోనే ఉన్నాయి. రజాల అగ్రహారం పరిధిలోని, నారాయణపురం గ్రామ సమీపంలో కొన్ని వరి చేలు నీట మునిగి ఉన్నాయి నారాయణపురం వద్ద వాహనాలు రాకపోకలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ ఆదే శాల మేరకు అధికారులు బృందం తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో ఉంటూ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోలీసులు సేవలను అందించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ రెండురోజుల పాటు అలుపెరగకుండా రాత్రి, పగలు నదులపరివాహక గ్రా మాల్లో అధికారులు, కూటమి నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యల చేపట్టారు. నారాయణపురం నుంచి రజాల వరకు బలహీనంగా ఉన్న నదుల గట్లను గుర్తించి ఇసుబస్తాలతో పూడ్చివేతకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే ఒంటరిగా స్కూటీ పై వెళ్లి జరుగుతున్న పనులను పర్యవేక్షించి ప్రాణనష్టం లేకుండా చూశారన్నారు. కాగా శుక్రవారం రజాల అగ్రహారం సమీపంలో గండిపడిన మేజర్ శారదా నదిగట్లను పరిశీలించేందుకు వచ్చిన హోం మంత్రి అనితను, అనకాపల్లి ఎంపీ సిఎం.రమేశ్, కలెక్టర్ విజయకృష్ణన్‌లను ఎమ్మెల్యే విజయకుమార్ గండి పడిన ప్రదేశానికి తీసుకువెళ్లి జరుగుతున్న పనులు జరుగుతున్న తీరు వివరించారు. ఎమ్మెల్యే పనితీరును అధికారులు, స్థానికులు అభినందించారు.

కెనరా బ్యాంకు చుట్టూ చేరిన వరద నీరు

ఎలమంచిలి/రాంబిల్లి: రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామంలోని కెనరా బ్యాంకు భవనం చుట్టూ శుక్రవారం ఉదయం వరద నీరు చేరింది. మైనర్ శారదా నది కుడివైపు గండి పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రదేశం నుంచి వరద నీరు బయటకు రావడంతో సమీపంలోని పంటపొలాలు ముంపుకు గురయ్యాయి. దీంతో అదే ప్రాంతంలో ఉన్న కెనరా బ్యాంకు భవనం చుట్టూ ఈ వరద నీరు చేరింది. శుక్రవారం ఉదయం వరద నీటిలోనే బ్యాంకు లావాదేవీలకు ఖాతాదారులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది.



నారాయణపురం వద్ద కెనరాబ్యాంకు భవనం చుట్టూ చేరిన వరద నీరు



ముంపునుంచి తేరుకున్న ఆక్వా చెరువులు

నిరుపేదలకు సకాలంలో సీఎం సహాయనిధి

▸▸ హోం మంత్రి వంగలపూడి అనిత



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరి వైద్యం కోసం ఖర్చు చేసుకుంటే దరఖాస్తు చేసుకున్న వెంటనే సకాలంలో ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య ఖర్చులు భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు దరఖాస్తు చేసుకున్న వెంటనే బాధిత కుటుంబాలకు సాయం అందించాలనే లక్ష్యంతో ఉన్నారని చెప్పారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ఆర్థిక భారం లేకుండా బాధిత కుటుంబాలను ఆదుకోవడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పేదలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు అబద్ధం, నాయకులు గింజాల శ్రీను, మడదా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సాయం



పూడిమడకలో సహాయాన్ని పంపిణీ చేస్తున్న సర్పంచ్, తదితరులు

అచ్యుతాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పూడిమడలో రేషన్ కార్డు ఉన్నవారందరికీ తుఫాను సహాయాన్ని అందిస్తున్నట్టు మాజీ సర్పంచ్ మేరుగు బాపు నాయుడు తెలిపారు. శుక్రవారం బాధితులకు రేషన్ సరకులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను వల్ల వేటకు వెళ్లని మత్స్యకారులకు 50 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే కేవలం మత్స్యశాఖలో రిజిస్టర్ అయిన వారికి మాత్రమే అధికారులు తెలిపారన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాలతో రేషన్ కార్డులున్న అందరికీ సహాయం అందజేస్తామన్నారు. ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార. బంగాళదుంపలు, ఉల్లిపాయలు, కిలో నూనె రేషన్ డీలర్ల ద్వారా 4500 కుటుంబాలకు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి సత్యనారాయణ, చేపల సుహాసిని, మేరుగు ప్రవీణ్, మేరుగు వెంకటరావుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై దాడికి దళిత సంఘాల నిరసన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

నక్కపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట పంచాయతీ కార్యదర్శి కాకర సత్యంపై దాడికి నిరసన దళిత సంఘాల ప్రతినిధులు శుక్రవారం ధర్నా చేశారు. కార్యదర్శి సత్యం దళితుడైనందునే కక్షకట్టి పిక్కి సాయి చరణ్, పిక్కితాతీలు తమ అనుచరులతో బెదిరించి దౌర్జన్యానికి పాల్పడ్డారని నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర నాటక రంగ డైరెక్టర్ పల్లా విలియం కేరీ, దళిత సంక్షేమ సంఘాల నేతలు కుంచే మధు, గోరింట ఆశ, సిక్కోలు కొండబాబు, గంట్యాడ రమేశ్ మాట్లాడుతూ కార్యదర్శితో పాటు సర్వేయర్ కె.సాయి వికాస్, సచివాలయ సిబ్బందిపై సచివాలయంలో దాడి చేయడం అమానుషమన్నారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐ జె.మురళీ, ఎస్ఐ సన్నిబాబుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘా నాయకులు పాల్గొన్నారు.

నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం



విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం సమీపంలోని సీతమ్మ వారి కొండపై ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరిపారు. విగ్రహ దాతలు, దంపతులతో వేద పండితులు హోమం చేయించారు. పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం భక్తుల సహాయ సహకారాలతో నిర్వహించినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కొనసాగుతున్న పెద్దేరు ఉధృతి

▸▸ వడ్డాది కాజ్‌వే పైనుంచి పారుతున్న వరద నీరు

▸▸ కొట్టుకుపోయిన రాళ్లు, కాంక్రీట్ ▸▸ నిలిచిన వాహనాల

బుచ్చెయ్యపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాలు తగ్గినప్పటికీ మండలంలోని వడ్డాది వద్ద పెద్దేరు నది కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం నాటికి కూడా ఉధృతి తగ్గలేదు. వరద నీటి ఉధృతికి కాజ్‌వే కొంత మేరకు రాళ్లు, కాంక్రీట్ కొట్టుకుపోయింది. కుంగిన పాత వంతెనపై పెద్ద వాహనాలకు అనుమతి లేకపోవడంతో కాజ్‌వే పైనుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కాజ్‌వే పైనుంచి నీటి ఉధృతి తగ్గిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



వడ్డాది కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

నిరాశ్రయులకు ఆహార పొట్లాలు పంపిణీ



శెట్టిబలిజ కాలనీ వాసులకు భోజనంను వడ్డిస్తున్న సర్పంచ్ అప్పారావు. తదితరులు

మునగపాక, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ముంపునకు గురైన స్థానిక శెట్టిబలిజ కాలనీ బాధితులకు తహశీల్దార్ సారథ్యంలో ఆహార పొట్లాలు అందజేశారు. జగనన్న, శెట్టిబలిజ కాలనీ వాసులకు వైసీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ ఏర్పాటు చేసిన భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



అరుణ పతాకం ఆవిష్కరిస్తున్న కార్మికులు

ఎలమంచిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో శుక్రవారం కార్మికులు ఏఐటీయూసీ 106 వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు కార్మికుల వద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తన పరిధిలో ఉన్నటువంటి కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ (ఏఐటీయూసీ) యూనియన్ జిల్లా ప్రధన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాను మాట్లాడుతూ దేశంలోనే ప్రథమంగా కార్మిక సంఘంగా ఏఐటీయూసీ ఏర్పాటైందన్నారు. కార్మిక, ఉద్యోగుల అనేక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరి సమక్షంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వై.నూకరాజు, సీహెచ్. వెంకటరమణ, డి.మహేశ్, జె.వెంకటరమణ, ఎం. నాగరాజులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల ప్రబలకుండా చర్యలు

ఎస్. రాయవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ అనంతరం ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు సూపర్ శానిటేషన్‌తో పాటు తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు చేయాలని ఎంపీడీవో మీనాకుమారి ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి తిమ్మాపురం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో హెచ్చరిక బోర్డు



పంచాయతీ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పాయకరావుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారిని ఆనుకుని అతిథి గృహం ఎదురుగా ఉన్న సుమారు 520 గజాల పంచాయతీ స్థలాన్ని డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో పట్టణానికి చెందిన ఇంజరపు నరసింహమూర్తి, ముక్కుడుపల్లి నాగరాజు తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారని చెప్పారు. పంచాయతీ స్థలాన్ని ఆనుకుని పుంత రోడ్డు ఆక్రమణకు గురైనట్టు తెలిపారు. పంచాయతీ స్థలంలో బోర్డు ఏర్పాటు చేశామని, పుంత ఆక్రమణలు తొలగిస్తామని ఆయన చెప్పారు. ఇప్పటికే పాయకరావుపేటలో వేసిన అక్రమ లే అవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ తెలిపారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

వైసీపీ నాయకులు కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఈపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటనగరం, రాజానగరం గ్రామాలలో శుక్రవారం పర్యటించి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడు తుఫాన్లు వచ్చినా ముందుగా నష్టపోయేది మత్స్యకారులేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరక్టరు చోడిపల్లి శ్రీనువాసరావు, జడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనువాసరావు, నాయకులు డి.బాబూరావు, జగతా శ్రీనువాసరావవు, వెంకటేశ్వరరావు, చేపల తాతాజీ, ఇసరపు తాతారావు, సర్పంచులు పి.పాపారావు, కె.కోటేశ్వరరావు, ఎం.రామగోవిందు, మత్స్యకార నేత వై.అన్నవరం పాల్గొన్నారు.

నేడు మునగపాకలో త్రిమూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ

మునగపాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంతబయల చాకిరేవుకు సమీపంలో శనివారం త్రిమూర్తులు విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్టు స్థానిక వడ్డెర కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్టు వారు చెప్పారు.

పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు

రావికమతం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని మత్సవానిపాలెం గ్రామంలో శుక్రవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంత పంటల్లో నీరు నిల్వ ఉందన్నారు. దాన్ని త్వరితగతిన బయటకు పోయేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. అలాగే వరి పంటకు తెగుళ్ల బెడద అధికంగా ఉందని, వాటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. పంటలు సాగు చేసే ప్రతీ రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సౌజన్య, ఎన్.సత్తిబాబు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి


స్థానికులతో మాట్లాడుతున్న డాక్టర్ హైమావతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురిసినందున ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి సూచించారు. శుక్రవారం జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా స్థానిక కోటవీధిలో 'ఫ్రై డే.. డ్రై డే' కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఖాళీ స్థలాలు, పూల మొక్కల కుండీల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ వుంటే దోమల వృద్ధి చెందుతాయని, అందువల్ల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని స్థానికులకు సూచించారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోదకాలు వ్యాధి వంటి వాటి బారిన పడే ప్రమాదం వుందని అన్నారు. కుటుంబలో ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటూ వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు పొందడంతోపాటు రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి ఏజే సత్యనారాయణ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బీవీఎస్ జయదీప్, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై సామగ్రి పెడితే చర్యలు తప్పవు : జడ్సీ


పూడిమడక రోడ్డులో ఉన్న డ్రమ్ములను తొలగింపు చేస్తున్న జడ్సీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్లపై ఇష్టానుసారంగా సామగ్రి పెడితే చర్యలు తప్పవని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పష్టం చేశారు. పట్టణంలోని పూడిమడక రోడ్డు, శారదా కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పూడిమడక రోడ్డులో ఓ వ్యాపారి ఐరన్ డ్రమ్ములను ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్డుపై పెట్టడంతో వ్యాపారి అతనిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా వాటిని దగ్గరుండి తొలగింప చేశారు. అదేవిధంగా రోడ్ల మీద ప్రకటనలు, ఆహ్వాన బోర్డులను కూడా తీయించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

'కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ రాజీలేని పోరు'



సీపీఐ కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తుమ్మపాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ రాజీలేని పోరాటం చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సీపీఐ కార్యాలయం వద్ద ఆయన పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు చట్టాలుగా కుదించడం అన్యాయమన్నారు. తక్షణమే సదరు చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం, నాయకులు విత్తనాల పోతురాజు, వియ్యపురాజు, ఎం.సత్తిబాబు, కోరిబిల్లి శంకరరావు, పప్పల ఈశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు. అలాగే, గుండాల జంక్షన్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు హరీష్, శేషు, రాజేష్, బోడి రాజు, దేవర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

పరవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో శిథిలమైన ఎలమంచిలి - గాజువాక రహదారికి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సినిమాహాల్ జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పూర్తిగా శిథిలమై పోయిందన్నారు. ఈ కారణంగా లంకెలపాలెం నుంచి పరవాడ మీదుగా అచ్యుతాపురం సెజ్‌కు వెళ్లే వాహనాలతో పాటు ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పరిమితికి మించి బొగ్గు లోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీల కారణంగా రహదారి మరింత ఛిద్రమైందన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లి అప్పారావు, గండి శ్రీనివాసరావు, బి.అప్పలనాయుడు, సీహెచ్.వెంకునాయుడు, రెడ్డి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఏఎస్ఐ అప్పారావుకు ఘన సన్మానం



అప్పారావు దంపతుల సన్మానంలో పోలీసు అధికారులు

అనకాపల్లి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్ఐ ఈతకోట అప్పారావు పదవీ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అప్పారావు దంపతులను ఏఎస్పీ దేవప్రసాద్ సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పారావు జిల్లాలోని వివిధ హోదాల్లో సేవలందించారన్నారు. శేష జీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తోటాడ రెగ్యులేటర్ వద్ద కాలువలో పూడిక తొలగింపు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం కారణంగా కురిసిన వర్షాలకు తోటాడ రెగ్యులేటర్ వద్ద గల కాలువలో ఏర్పడిన పూడికలను రైతులు శుక్రవారం తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ కాలువలో పూడిక తొలగించకపోతే చెత్త పేరుకుపోయి పంట పొలాలకు నీరు చేరేందుకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విల్లూరి పైడారావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, ఆడారి ఆనంద సన్యాసినాయుడు, జోగినాయుడు, శిలపరశెట్టి బాబి పాల్గొన్నారు.

ప్రయాణం.. భయం..భయం..

అధ్వానంగా పరవాడ- గాజువాక రహదారి | పలు చోట్ల అస్తవ్యస్తంగా మారడంతో తరచూ ప్రమాదాలు | పట్టించుకోని అధికారులు


పరవాడ- గాజువాక ప్రధాన రహదారిపై గుంతలు పడిన దృశ్య

పరవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పరవాడ- గాజువాక ప్రధాన మార్గం పలుచోట్ల అధ్వానంగా మారింది. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ నుంచి బంగ్లా జంక్షన్ వరకు, అలాగే అక్కడి నుంచి సినిమాహాల్ జంక్షన్ వరకు మరీ దారుణంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రహదారికి మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి పలుచోట్ల పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తుంది. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ఇదే రహదారి గుండా గాజువాక, విశాఖపట్నం, అచ్యుతాపురం సెజ్, ఫార్మాసిటీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు పరవాడ, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, స్టీల్‌ప్లాంట్, జాజులవానిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో ప్రయాణిస్తున్న లారీలు కూడా ఇటుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారిపై గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆదమరిచి ఈ రహదారి గుండా ప్రయాణిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేసేందుకు చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.


మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ వద్ద దుస్థితి

బంగారమ్మపాలెంలో దెబ్బతిన్న బొప్పాయి

ఎకరాన్నర భూమిలో సాగు చేస్తున్న రైతు

వరద తాకిడికి చెట్లు నేలకొరగడంతో ఆవేదన

సబ్బవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బంగారమ్మపాలెంలో తుఫాన్ ధాటికి దాడి కన్నంనాయుడుకు చెందిన పొలంలో సుమారు ఎకరాన్నర భూమిలో వేసిన బొప్పాయి తోట నేలకొరిగింది. ఏడాది క్రితం వేసిన ఈ పంట దిగుబడి రావలసి ఉంది. అంతలోనే తుఫాన్ దెబ్బతీసిందిని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మరికొందరు రైతులకు చెందిన బొప్పాయి తోటలు కూడా వరద ధాటికి నేల కూలాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాల్సిందిగా ఆయన కోరారు.


తుఫాన్ ధాటికి ఒరిగిన బొప్పాయి చెట్లు


బాధిత కుటుంబానికి సరకులు అందజేస్తున్న ఎంపీ రమేశ్, మాజీ ఎమ్మెల్యే పీలా

కశింకోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లిలో తుఫాన్ బాధిత కుటుంబాలకు శుక్రవారం ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు శుక్రవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొంథా తుఫాను వల్ల నష్టపోయిన కుటుంబాలను, రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేయడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ


గొర్లివానిపాలెంలో సరకులు అందజేస్తున్న సబ్బవరం తహశీల్దార్....

సబ్బవరం : తుఫాన్ బాధితులకు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రామచంద్రరావు, ఎంపీటీసీ చైతన్య, కూటమి నేతలు గండి దేముడు, కేవీ రమణ, ఎల్లాజీరావు, గొంప నాయనప్ప, బంతికోళ్ల పద్మ, ఆర్ఐ వీరయ్య, కార్యదర్శి రాజేశ్వరరావు, వీఆర్వోలు ఆదిరెడ్డి రవి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి పోటీలు

సబ్బవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో వివిధ పాఠశాలకు చెందిన ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలను ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు తొలుత ప్రారంభించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలు ఏర్పాటు చేశారు. ఇందులో విజేతలుగా నిలిచినవారు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని ఎంఈవోలు తెలిపారు. విద్యార్థులు పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి నివాళి


ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కశింకోట, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని శుక్రవారం కశింకోటలో నిర్వహించారు. ప్రధాన రహదారిలో గల ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కత్తెర శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. పేదరిక నిర్మూలనకు ఆమె చేసిన సేవలు కొనియాడారు. నాయకులు మాదేపు నాయుడు, కాళ్ల సత్యనారాయణ, గున్నబాబు, కిశోర్, బాల మురళీ, రాజు, రామారావు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ జీవితం ఆదర్శనీయం

జయంత్యుత్సవంలో వక్తలు



పటేల్ చిత్రపటం వద్ద ఏఎస్పీలు నివాళి

అనకాపల్లి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి ఉప ప్రధాన మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన పటేల్ జయంతిలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో...

కొత్తూరు : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో వల్లభాయ్‌పటేల్ జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశంలో చిన్న చిన్న సంస్థానాలు విలీనం కావడంలో ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. ఇటువంటి మహనీయుడ్ని భారత ప్రభుత్వం భారతర్న బిరుదుతో తగిన విధంగా గౌరవించిందని గుర్తు చేశారు. అలాగే భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల సూపరింటెండెంట్ పెంటకోట అనురాధ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో-ఆర్డినేటర్ జె.సామ్రాజ్యం, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో..

అనకాపల్లి టౌన్ : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఉక్కుమనిషి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వల్లభాయ్‌పటేల్ చూపిన క్రమశిక్షణ, దేశభక్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.గణేష్ ప్రసాద్‌రెడ్డి, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ కేఎస్ ఈశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం కళాశాలలో...

సబ్బవరం : వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక గురుకుల విద్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, సీఐ రామచంద్రరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి అనంతరం ర్యాలీ చేపట్టారు. అదే విధంగా ఇక్కడ బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు రెడ్డి రామునాయుడు, సామ్రాట్‌కుమార్, అచ్చంనాయుడు, ఆకాష్‌కుమార్ తదితరులు పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లెక్కల గణేష్, పెంటారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి


సబ్బవరం బీజేపీ కార్యాలయంలో...

నర్సింగబిల్లిలో...

కశింకోట : మండలంలోని నర్సింగబిల్లిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా పూలమాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ తిరుమలరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం


ఎంఈవోకు నూతన కార్యవర్గం వివరాలను అందజేస్తున్న దృశ్యం

తుమ్మపాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఇక్కడ నిర్వహించారు. అధ్యక్షుడిగా వీకేఎం సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.లక్ష్మణ్, కోశాధికారిగా ఎంవీ నూకేష్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఉన్నతికి పాటు పడతామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రకటించారు.

వెంకన్న ఆలయంలో ఊంజల్ సేవ రేపు



పరవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ కొండపై కొలువైన అభయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఊంజల్‌సేవ నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు బుగిడి రామగోవిందరావు తెలిపారు. ఇందులో భాగంగా వెయ్యి దీపాలు వెలిగించిన అనంతరం స్వామివారికి ఊంజల్ సేవ జరుపుతామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సింది కోరారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుడు అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు పట్టణ ఎస్ఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. అచ్యుతాపురం మండలం హరిపురం గ్రామానికి చెందిన పొట్టల తాతయ్యలు, తన భార్య ధారతో కలిసి ఇక్కడి నెయ్యిల వీధిలో నివాసం ఉంటున్నాడు. భార్య హోటల్‌లో పని చేస్తుండగా, అతడు కార్పెంటర్ వృత్తిగా పని చేస్తుంటాడు. ఆరోగ్యం బాగోలేని తాతయ్యలు 28వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

దిబ్బవీధిలో మెగా వైద్య శిబిరం రేపు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలో నాగేంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఎనిమిది మంది వైద్య నిపుణులు హాజరై రోగులకు ఉచితంగా పరీక్షలు జరుపుతారని నిర్వాహకులు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానుందని వివరించారు.

పంట నష్టం నమోదు చేసుకోవాలి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని టీడీపీ 80వ వార్డు ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు రైతులకు సూచించారు. శుక్రవారం వార్డులో పర్యటించి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు వెళ్లి పంట నష్టం వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి మల్లేశ్వరరావు, బొడ్డేడ మురళీ తదితరులు పాల్గొన్నారు.


తోకరాయి నిర్వాసితులకు రేషన్ అందిస్తున్న అధికారులు


బొర్రాలో సరుకులు అందజేస్తున్న తహసిల్దార్, జడ్పీటీసీ సభ్యుడు


కొట్టుకుపోయిన కమ్మరపుట్టు చెక్‌డ్యామ్ వద్ద పెసా కమిటీ సభ్యులు

వర్షాలు తగ్గుముఖంతో ఊరట

» బాధితులకు సహాయ చర్యలు
» నిత్యావసరాలు పంపిణీ

సీలేరు: జీకేవీధి మండలం పరిధిలోని తోకరాయి, చట్రాపల్లి గ్రామాలకు చెందిన తుఫాన్ బాధిత కుటుంబాలకు శుక్రవారం నిత్యావసర సరుకులు ధారకొండ, సప్పర్ల డీఆర్ డిపోల ద్వారా పంపిణీ చేసినట్టు తహశీల్దార్ అన్నాజీరావు తెలిపారు. తోకరాయిలో 61 కుటుంబాలకు, చట్రాపల్లిలో 37 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీలల బియ్యం, ఒక లీటర్ పామాయిల్, కేజీ బంగాళదుపంలు, కేజీ ఉల్లిపాయలు, కేజీ కందిపప్పును అందించామన్నారు. తోకరాయి గ్రామస్తులకు ధారకొండ డీఆర్ డిపోలో, చట్రాపల్లి గ్రామస్తులకు సప్పర్ల డీఆర్ డిపోలో సరకులను పంపిణీ చేసినట్టు వివరించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సాయంగా ప్రకటించిన నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చెయ్యడానికి తమ సిబ్బంది బాధితుల ఆధార్ కార్డుల జిరాక్సులను, బ్యాంక్ ఖాతాల వివరాలను సేకరించారని, దీని ఆధారంగా వారి ఖాతాలకు నగదు జమ చేస్తామని ఆయన తెలిపారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బాలన్న, వీఆర్వో సత్యనారాయణ, గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు, కూటమి నాయకుల సమక్షంలో ఈ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామని తహసీల్దార్ తెలిపారు.

ఘాట్ రోడ్లలో హెచ్చరిక బోర్డులు

కొయ్యూరు: వర్షాల ప్రభావంతో ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రదేశాలలో వాహన చోదకులు, ప్రజలను అప్రమత్తం చేసే దిశగా కొయ్యూరు పోలీసులు హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు డౌనూరు నుంచి లంబసింగి వెళ్ళే చింతపల్లి ప్రధాన రహదారిలో గల డౌనూరు ఘాట్ రోడ్డు, నడింపాలెం నుంచి రొంపుల వెళ్ళే రొంపుల ఘాట్ రోడ్డులలో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉంది, వర్షం కురుస్తున్న సమయంలో వాహనాలు జాగ్రత్తగా వాహనాన్ని నడపాలని హెచ్చరిస్తూ బోర్డుల్లో సూచించారు.

డుంబ్రిగుడ: కోర్రా పంచాయతీ పెదపాడు గ్రామానికి చెందిన గెమ్మెలి రాము అనే గిరిజనుడి పెంకుటిల్లు దెబ్బతింది. ఈవిషయాన్ని తెలుసుకున్న వైసీపీ మండల ఉపాధ్యక్షుడు గణపతి ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం బస్తా, నిత్యావసరాలను గణపతి ద్వారా అందించారు. వార్డు సభ్యులు కామయ్య మాజీ ఉప సర్పంచి కామేశ్, మోహనరావు ఈశ్వరరావు, చంటి పాల్గొన్నారు.

హుకుంపేట; పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించినట్టు తహశీల్దార్ శ్రీనువాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 27నుంచి 30 వరకు పునరావాస కేంద్రాలో ఉన్న ఉన్నవారి బ్యాంక్ ఖాతాకు నగదు జమతోపాటు, బియ్యం , నూనె, ఉల్లిపాయలు, పంచదార, పప్పు బంగాళదుంపలు తదితర వాటిని అందించామన్నారు. ఇళ్లను సర్వే చేసి పరిహారం అందేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో డీపీవో చంద్రశేఖర్, ఎంపీడీవో రమాదేవి, స్థానిక సర్పంచ్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ

అనంతగిరి: మండలంలోని బొర్రా పునరావాస కేంద్రంలోని చప్పాడి, వంట్లమామిడి గ్రామస్థులకు శుక్రవారం నిత్యావసర సరకులను తహసీల్దార్ వీరభద్రచారి, జడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ జె.అప్పారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, జనసేన నాయకుడు సీహెచ్.మురళి, రఘునాథ్, నవీన్, వీఆర్వో విజయమణి, వీఆర్‌ఏ దామోదర్, తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో స్థానిక సర్పంచ్ సీతయ్య, ఉప సర్పంచ్ నరేంద్ర ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరభద్రచారి నిర్వాసితులకు నిత్యావసర సరకులను శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ సీతయ్య, ఉపసర్పంచ్ నరేంద్ర మాట్లాడుతూ..ఇళ్లు, పంటపొలాలు నష్టపోయిన వారికి ఆదుకోవాలని, రోడ్లు, కోతకు గురైన కల్వర్టులను మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ జగ్గయ్యమ్మ, వీఆర్వో అనిల్, వైసీపీ నాయకులు గంగులు, పెసా అధ్యక్షుడు వెంకటరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు కృష్ణ, పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ మరమ్మతు చేపట్టాలి

హుకుంపేట; మండలంలోని రంగశీల పంచాయతీ ఒంటిపాక, కుమ్మర్‌పుట్టు చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేపట్టాలని పెసా కమిటీ సభ్యులు పాంగి తమన్న, భాగ్యరాజులు గ్రామస్థులు డిమాండ్ చేశారు. శు క్రవారం తుఫాన్ దెబ్బతిన్న కుమ్మర్‌పుట్టు చెక్‌డ్యామ్, రంగశీల చేరుగెడ్డలను పరిశీలించారు. ఈ చెక్‌డ్యామ్‌లు కొట్టుపోవడంతో వచ్చే ఏడాది ఖరీఫ్‌లో పంటలనకు చుక్కనీరందదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత నష్టం జరిగినా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇకనైనాస్పందించి చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలోరౌతన్న చిన్న, మత్యరాజు,గసన్న అప్పారావు పాల్గొన్నారు.


హుకుంపేటలో..

41 ఇళ్లకు నష్టం

కొయ్యూరు: మొంథా తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా 41 పూరిళ్లకు నష్టం వాటిల్లినట్టు తహశీల్దార్ ఎస్ఎల్‌వి ప్రసాద్ తెలిపారు. వీటిలోట మూడు పూర్తిగా, 38 పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ మేరకు బాదితులకు నష్టపరిహారం అందించే దిశగా నివేదికలిచ్చామని ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేయగానే అందిస్తామన్నారు.

ఇళ్లలోకి నీటి ఊటలు.. దయనీయ స్థితిలో కుటుంబాలు

» బొండాం కొత్తవలసలో దుస్థితి

అరకులోయ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి వర్షాలతో గిరిజన గ్రామాల్లో ఇళ్లలోకి నీటి ఊటలు చేరడంతో పలు గిరిజన కుటుంబాలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నాయి. బొండాం కొత్తవలస గ్రామంలో ఓ కొండ మెట్టకు ఆనుకుని ఇళ్లున్నాయి. మూడు రోజులుగా మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో కొండను ఆనుకుని పైవరుసలో ఉన్న ఇళ్ల లోపలనుంచి ఊటలు వస్తున్నాయి. దీంతో ఇళ్లంతా తడిబారి లోపల ఉండలేని దుస్థితి నెలకొన్నట్టు బాధితులు గెమ్మెల సుబ్బారావు, తామల చిన్నయ్య,తామల అప్పలస్వామి, తామల సత్యారావులు ఈ సందర్భంగా వాపోయారు. దీంతో గత నాలుగురోజులుగా ఈ కుటుంబాలు పాఠశాల భవనంలో ఆశ్రయం ఇచ్చినట్టు స్థానికులు రామస్వామి, రాజారావు, జోషి తదితరులు పేర్కొన్నారు. గతంలోనే ఇళ్లపైన కొండ మట్టి దిబ్బలు జారిపడ్డాయన్నారు. ఈ గ్రామం ఉన్న చిన్నపాటి కొండ (మెట్ట) ఓవైపు నుంచి కొండచరియలు మరింత జారిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఏ క్షణంలో విపత్తు సంభవిస్తుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. కొన్నాళ్ల కిందట రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులను సుర క్షితమైన ప్రాంతానికి పంపించేందుకు వీలుగా ప్రభాత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మోడల్‌విలేజీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ హామీ అమలు కాలేదు. రెవెన్యూ, మండల అభివృద్ధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.


బురదమయమైన ఓ ఇంట్లో దృశ్యం

పీఏసీఎస్ ద్వారా రైతులకు రుణాలు


రుణాలు అందిస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్, అధికారులు

హుకుంపేట అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి); కో ఆపరేట్ బ్యాంక్ రైతులకు అందిస్తున్న రుణాలు సక్రమంగా వినియోగించు కోవాలని స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ కిల్లో మోహన్‌దాస్ కోరారు శుక్రవారం మండలంలోని రూ. 7లక్షల రుణాలను రైతులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పనులకు పెట్టుబడులు అందించేందుకు బ్యాంకు ద్వారా అందిస్తోందన్నారు. తొలివిడతగా మండలంలోని 13 మందికి 7 లక్షలు అందించామ్నారు. ఇంకా అర్హులైన రైతులు వస్తే రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్య క్రమంలో సొసైటీ జీఎం శ్రీనివాసరావు, బీఎం శ్రీనివాస్, డైరెక్టర్ గసన్న, సీఈవో అప్పాలనాయుడు, కార్యదర్శి కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

పాడేరురూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవం జిల్లా కో-కన్వీనర్ అమర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన ప తాకాన్ని జిల్లా ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు హరి ఆవిష్కరించారు.4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు, పెట్రోలుబంకుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రమేష్, అప్పలరాజు, ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ప్రధాన కార్యదర్శి వి. పండుబాబు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ 1920లో ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.శ్రీనుబాబు, కె.సత్తిబాబు, కె.బాబురావు, జి.సురేశ్, కె.బుజ్జిబాబు, జి.శ్రీనుబాబు, కె.మోహన్, కె.జోసెఫ్, కిశోర్ పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ అధికారిగా అసిస్టెంట్ కలెక్టర్

అనంతగిరి, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీంపోలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఇటీవల ఓ విద్యార్థిని మృతిచెందడంపై సమగ్ర విచారణ నిమిత్తం అసిస్టెంట్ కలెక్టర్‌ను ఉన్నతాధికారులు నియమించినట్టు ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ తెలిపారు. త్వరలోనే విచారణ ప్రారంభించనున్నట్టు ఆయన శుక్రవారం తెలిపారు.

మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

పాడేరురూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్రను పోషించాలని ఈగల్ క్లబ్ ఇన్‌చార్జి శివ శంకర్ నాయక్ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రి న్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి అధ్యక్షతన కళాశాల సెమినార్ హాల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనం తరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు అలవాట్లతో మానసిక, సామాజిక ప్రభావాలను వివరించారు.ఈ కార్యక్రమంలోమెడికల్ కళాశాల మానసిక వైద్య నిపుణు లు టీఎస్ఎన్. రాజు, ఈగల్ క్లబ్ కో-ఆర్డినేటర్ డి.గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ చైర్మన్‌కు సన్మానం

పాడేరురూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పాడేరు పర్యటనకు శుక్రవారం వచ్చిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పాడేరులో డెయిరీ బ్రాంచి అభివృద్ధికి తగిన సహకారం అందించాలని కోరారు.

గిరిజన భాషల పరిరక్షణే లక్ష్యం

సాగర్‌నగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గిరిజన భాషలను పరిరక్షించడమే తమ ప్రథమ కర్తవ్యమని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా సంచాలకురాలు ఎస్. భార్గవి అన్నారు. రుషికొండ గిరిజన మ్యూజియంలో టీసీఆర్‌టీఎం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. గిరిజన కట్టుబాట్లు, సంస్కృతి సంప్రదాయాలు భాషతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మందారాణి, డి. రమేశ్‌భూషణ్, మృత్యుంజయరావు, పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో విస్తృతంగా పశువైద్య శిబిరాలు


పశువుల మందులు అందిస్తున్న పశువైద్య అధికారులు

పాడేరురూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో నీరసించిన, జబ్బు పడిన పశువుల కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్.వి.జయరాజ్ సూచించారు. మండలంలోని బర్సింగి పంచాయతీ గడ్డివలస, బర్సింగి, జి.కొత్తూరు, బూరుగుపుట్టు, డోకూలూరు మండిపుట్టు, డేగలవీధి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో ఎక్కడైనా పశువులు చనిపోతే పంచాయతీ సర్పంచ్, సెక్రటరీలతో పంచనామాలు చేయించి నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఆరు గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాల్లో 655 పశువులకు గొంతు వాపు టీకాలు, 450 మేకలు, గొర్రెలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు, 25 దూడలకు నట్టల నివారణ మందులు అందించామన్నారు. బర్సింగి సర్పంచ్ బి.చిట్టిబాబు, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్.వేణుమాదవ్, డోకులూరు సహాయ లైవ్ స్టాక్ అధికారి కుందూరు సురేష్, సచివాలయ సహాయకులు సన్యాసిరాజు, వాసన్ సంస్థ కో-ఆర్డినేటర్లు దామోదర్, నాగరాజు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఏపీఎఫ్‌డీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పాడేరురూరల్, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిధిలోని ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో పనిచేస్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కాఫీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు లింగేరి సుందరరావుతో కలిసి శుక్రవారం ఏపీఎఫ్‌డీసీ డీఎం జి.కృష్ణబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు లభించినప్పటికి కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారి వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కన్ననాథ్, చిన్నాలమ్మ, అప్పలమ్మ, పుష్పరాణి, పద్మ, మణి, లక్ష్మి, కాంతామణి పాల్గొన్నారు.

సంగోడి స్పటిక శివాలయాన్ని దర్శించుకున్న కిడారి


శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరురూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో ప్రసిద్ధి చెందిన స్పటిక లింగేశ్వరస్వామి ఆలయాన్ని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ శుక్రవారం దర్శించుకుకుని ప్రత్యేక పూజలు, స్వామివారికి అభిషేకాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఓం శాంతి ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకులు పి.పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, జి.మురళి, స్వామి, రాజు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక


ఉపాధ్యాయులతో పోటీలకు ఎంపికైన పాపారావు

ముంచంగిపుట్టు, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న వంతాల పాపారావు అండర్-17 విభాగంలోని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. పాడేరులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తప్రతిభను కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్‌ఎం కె.నారాయణ, పీడీ విశ్వనాథం, ఉపాధ్యాయులు అభినందించారు.

కాఫీ తోట నరికివేతపై ఫిర్యాదు

కొయ్యూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తన సాగులో ఉన్న భూమిలో వేసిన కాఫీ తోటను దౌర్జన్యంగా నరికి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మర్రివాడ పంచాయతీ నిమ్మలగొందికి చెందిన గబులంగి చంటిబాబు శుక్రవారం కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి సమీపంలో గల అటవీ బంజరులోని ఎకరా భూమిలో తుప్ప డొంక తొలగించి సాగులోకి తెచ్చుకుని మూడేళ్ల క్రితం కాఫీ మొక్కలు నాటానని పేర్కొన్నాడు. ఈ ఏడాది ఫలసాయం వచ్చేలా ఉండగా గ్రామానికి చెందిన కిల్లో లక్ష్మణరావు అనే వ్యక్తి రెండు రోజులుగా కాఫీ తోటను సమూలంగా నరికి ధ్వంసం చేశారన్నారు. లక్ష్మణరావుపై విచారణ జరిపి, జరిగిన నష్టానికి తగిన సహాయం అందించేలా చూడాలని చంటిబాబు కోరాడు.

'హైడ్రో పవర్ ప్రాజెక్టులను అడ్డుకుంటాం'

చింతపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుని అడ్డుకునే హక్కు ఆదివాసీలకు ఉందని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. శుక్రవారం యర్రవరం గ్రామంలో ఆదివాసీలతో సమావేశమైన గిరిజన సంఘం నాయకులు హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టిన సర్వే పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, ఎర్రబొమ్మల సర్పంచ్ లోత పండయ్య, ఉప సర్పంచ్ సెగ్గె సోమరాజు, గ్రామ పెద్దలు బాబూరావు, పాంగి కామరాజు పాల్గొన్నారు.

సర్వే దారుణం..

అరకులోయ: హైడ్రోపవర్ ప్రాజెక్టుల పనులు నిలిపివేసినట్టు కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ ప్రకటిస్తుంటే....మరో వైపు గ్రామాల్లో రాత్రివేళలో డ్రోన్లతో సర్వేలు చేపట్టడం ఏమిటని ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఏపీగిరిజన సంఘం కార్యాలయంలో హైడ్రో వర్‌ప్రాజెక్టుల వ్యతిరేకపోరాట కమిటీ ప్రతినిధులతో కలిసి బాలదేవ్ విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బస్కీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు , హైడ్రో ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ నేత బురిడి దశరత్, జిల్లా కో కన్వినర్ జగన్నాథం, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ సన్మానం


ఎస్‌ఐ రవీంద్రను సన్మానిస్తున్న దృశ్యం

సీలేరు, అక్టోబరు 31 , (ఆంధ్రజ్యోతి) : బదిలీపై వెళ్తున్న సీ లేరు ఎస్‌ఐ రవీంద్ర ను స్థానిక పోలీస్టేషన్‌లో శుక్రవారం సిబ్బంది, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భం గా స్థానిక నూతన ఎస్‌ఐ ఎండీ యాసిన్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ సీలేరులో తన విధి నిర్వహణలో స్థానిక సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు ఎంతో సహాయ సహకారాలను అందించారన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌కె మస్తాన్‌వల్లీ, కూ టమి నాయకులు , ఇతర గ్రామ పెద్దలు రవీంద్రను సన్మానించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

డుంబ్రిగుడ, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): మండంలోని పోతంగి పంచాయతీ కుసుమ వలస సమీపంలో తృటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం కుసుమ వలసలో వారపు సంతకు కోర్రా గ్రామానికి చెందిన వ్యాపారులు బయలుదేరారు.ఆటోకు బ్రేక్ ఫెయిలై డివైడర్‌ను దాటి లోయలో పడింది. ఆటోలో ప్ర యాణిస్తున్ననలుగురు స్వల్ప గాయాలతో బయటపడినట్టు స్థానికులు తెలిపారు.


చింతపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా, పోలీసులు


పాడేరులో సమైక్యతా ర్యాలీ చేపట్టిన బీజేపీ నాయకులు


అనంతగిరిలోని పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

జాతీయ సమైక్యతను చాటిన సర్దార్ వల్లభాయ్ పటేల్

» ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

పాడేరురూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతను చాటిచెప్పిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన జాతీయ సమైక్యతా ర్యాలీని ప్రసాద్‌తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్‌కుమార్, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ ప్రారంభించారు. అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉన్న 560 సంస్థానాలను కలిపి భారతదేశం అంతా ఒకటిగా చేసిన మహనీయుడు వల్లభాయ్ పటేల్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పి.రాజారావు, స్వప్నకుమారి, సురేంద్ర మోహన్, పి.రవికుమార్, ట్రైకార్ డైరెక్టర్ కె.కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

ఏబీవీపీ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ వి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ తిరుపల్లి యోగి, బి.సంజయ్ కుమార్, చిన్నబ్బాయి, సాగర్ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: ఏఎస్పీ

చింతపల్లి: పోలీసుల అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని స్థానిక ఏఎస్పీ నవ జ్యోతి మిశ్రా అన్నారు. శుక్రవారం రాత్రి అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా ఏఎస్పీ, పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు శాంతి భద్రతలు కల్పించేందుకు 24గంటలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్సైలు వి. వెంకటేశ్వరరావు, ఎం. వెంకటరమణ పాల్గొన్నారు.

జి.మాడుగుల : స్థానిక సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ షణ్ముఖరావు సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమండెంట్ వినయ్‌గన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం యూనిటీ రన్, మానవహారం చేపట్టారు.పోలీస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి స్థానికంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ షణ్ముఖరావు, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌వినయ్‌గన్,సీఆర్‌పీఎఫ్,ఏపీఎస్పీ సిబ్బంది ఉన్నారు.



జి. మాడుగులలో ర్యాలీలో పాల్గొన్న సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

అనంతగిరి: పోలీసు అమరవీరులు సంస్మరణ దినోత్సవాలు సందర్భంగా స్థానిక ఎస్‌ఐ డీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని శుక్రవారం పోలీసులకు పరుగుపందెం పోటీలను నిర్వహించారు. వీధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ సాయంత్రం క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఏఎస్‌ఐ రాజంనాయుడు, అధ్యాపకుడు తౌటినాయు డు, కానిస్టేబులు వైకుంఠం, గిరి, డొంబు, రాజేంద్ర, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

కొయ్యూరు: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ముందుకు సాగాలని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కొయ్యూరులో సీఐ ఆధ్వర్యంలో కొయ్యూరు, మంప ఎస్‌ఐలు కిషోర్‌వర్మ, శంకరరావు, సిబ్బంది శాంతి ర్యాలీ నిర్వహించారు. అ మరులకు ఘనంగా నివాళి అర్పించారు. అలాగే, ఏక్తా దివాస్ సందర్భంగా కాకరపాడు గురుకుల విద్యార్థులు, సిబ్బందితో పాటు ఏపీఎస్‌పీ సిబ్బంది, పోలీసులు యూనిటీ రన్ నిర్వహించారు.

చింతపల్లి: దేశ సమైక్యతకు ప్రజలు కదలిరావాలని స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు అన్నారు. శుక్రవారం సర్దర్ వల్లభాయ్ పటేల్ జయంతి నేపథ్యంలోట పోలీసులు 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వి. వెంకటేశ్వరరావు, ఎం. వెంకట రమణ పాల్గొన్నారు.

సీలేరు: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఏపీ జెన్‌కో సెక్యూరిటీ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్‌చార్జి ఈఈ జయపాల్ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. సెక్యూరిటీ విజిలెన్స్ సీలేరు ఇన్‌చార్జి కోటేశ్వరరావు, ఏవో ఈవీవీ స త్యనారాయ ణ, జెన్‌కో ఇంజనీర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు. సీలే రులో ఎస్‌ఐ ఎండీ యాసిన్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ పో లీసులు యోగా, వ్యాయామ, 5కే రన్నింగ్ కార్యక్రమాలను చేపట్టారు.

ముంచంగిపుట్టు: స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ముంచంగిపుట్టులో ర్యాలీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హామీ ఇచ్చారు. మండలంలో కోనాం పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన 32 కుటుంబాలకు, జైతవరం, ముడిచెర్ల, గ్రామాలకు చెందిన 27 మంది కుటుంబాలకు శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు అండగా ఉంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కిశోర్‌లింకన్, ఎంపీడీవో వి.హేమసుందరరావు. ఆర్ఐ కృష్ణ, సర్పంచ్ వంటాకు నరసింహనాయుడు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, వీఆర్వోలు కె.అప్పారావు, లక్ష్మి, కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ


నిత్యావసర సరకులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

మాడుగుల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డి.గొటివాడ పునరావాస కేంద్రంలో బాధితులతో ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి సకాలంలో సేవలు అందించారన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశానుసారం బాధితులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. వారికి నూనె, పప్పు దినుసులతో పాటు నగదు కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ రాజారాం, తహశీల్దారు రమాదేవి, నాయకులు జగ్గారావు, సన్యాసిరావు, దేముడు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునరావాస కేంద్రాల్లో ఉన్న తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. గర్సింగి గ్రామంలో బియ్యం, కందిపప్పు, పామాయిల్, బంగాళా దుంపలు, పంచదార అందజేశారు. తహశీల్దార్ లక్ష్మీదేవి, సర్పంచ్ రాము, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జనసేన నాయకుడు రామ్మూర్తినాయుడు, టీడీపీ నాయకులు సూర్యనారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

చోడవరంలో...


బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. చైత్రనగర్‌లోని రేషన్ డిపో వద్ద సరకులు అందించి నిర్వాసితులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అంబటి రామారావు, సర్పంచ్ నూకరత్నం, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, నకురు కోటేశ్వరరావు, శ్రీను, ద్వారపురెడ్డి శ్రీనివాస్, బాలిబోయిన దేముడు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సేవలు అభినందనీయం

» ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు

మాడుగుల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో ప్రాణ నష్టం జరుగకుండా అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలు అభినందనీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావితం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ సమాచారం మేరకు సీఎం చంద్రబాబు ముందు ఆలోచనతో చర్యలు తీసుకొని ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులను అప్రమత్తం చేశారన్నారు. ముంపు గ్రామాలతో పాటు శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశారన్నారు. వర్షం కారణంగా పొంగి ప్రవహిస్తున్న గెడ్డవాగులు దాటకుండా చూడాలని ఉద్యోగులను ఏర్పాటు చేశారన్నారు. అలాగే పంట నష్టంపై అధికారులు సర్వే చేసి, బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన పోటీలు


మండల స్థాయి విజేతలతో ఎంఈవో సింహాచలం, ఉపాధ్యాయులు

చోడవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు జడ్పీ బాలికల హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవంపై శుక్రవారం మండల స్థాయి వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పాఠశాలల స్థాయిలో విజేతలుగా నిలిచిన 42 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో విజేతలకు ఎంఈవో కె.సింహాచలం బహుమతులు అందించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐ.వి.రామిరెడ్డి, సీఆర్పీలు కేవీఎం నాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవంపై శుక్రవారం మండల స్థాయి వ్యాచరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కాశీపురానికి చెందిన మేఘన, దేవరాపల్లికి చెందిన వనజ, ఎం.అలమండకు ఎస్.వర్షిణి మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో ఉషారాణి తెలిపారు.

చివరికి కన్నీరే మిగిలింది..!

మొంథా తుఫాన్ వర్షాలకు నీట మునిగిన పంటలు

గాలుల ధాటికి నేలకొరిగిన తోటలు

భారీ నష్టంతో ఆందోళనలో రైతులు

మాడుగుల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించిన రైతులను మొంథా తుఫాన్ నిలువునా ముంచేసింది. భారీ వర్షాలకు చి'వరి' దశలో వారికి కన్నీ'రే' మిగిలింది. ఈదురుగాలుల ధాటికి తోటలు కూడా నేలకొరగడంతో వారు దిక్కుతోచన స్థితిలో పడిపోవాయరు.

మాడుగుల మండలంలో మొంథా తుఫాన్ దాటికి మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాలు నీట మునిగిపోయాయి. చేతకందొచ్చే సమయంలో వరి, చెరకు పంటలు నీటమునిగి పాడయ్యాయి. సరుగుడు మొక్కలు కూడా గాలికి నేలకొరిగి భూ భాగంలో విరిగిపోయాయి.

మాడుగుల మండల కేంద్రంతో పాటు రామచంద్రపురం, ఎం కోడూరు, ఎం.గదబూరు, ఖండివరం వెళ్లే దారిలో వరి పంట పొలాలతో పాటు చెరకు, సరుగుడి తోటలు కూడా ధ్వంసమయ్యాయి. తుఫాన్ దాటికి నష్టపోయిన పంటలను గుర్తించాలని అధికారులను వ్యవసాయ రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వ్యవసాయ శాఖ అధికారిణి అనసూయ వద్ద ప్రస్తావించగా, తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట అంచనాలు వేసేందుకు సర్వేలు చేస్తున్నామని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని, నష్టపోయిన ప్రతీ రైతు పంటను సర్వేచేసి పరిహారం అందేలా కృషి చేస్తామని ఆమె తెలిపారు.


మాడుగుల మండలంలోని ఎం.కోడూరు రహదారి పక్కన నీట మునిగిన వరి పంట


రామచంద్రపురం గ్రామానికి వేళ్ల రహదారిలో గాలికి నేలకొరిగిన సరుగుడు మొక్కలు

ముంపులోనే విద్యుత్ సబ్ స్టేషన్

రావికమతం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఇంకా వాన నాటి ముంపులోనే ఉంది. దీంతో అక్కడ రోజుల తరబడి సామగ్రి నీటిలో ఉండిపోయి తుప్పు పడుతున్నది. రావికమత-కింతలి వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న సబ్ స్టేషన్‌ను లోతట్టు ప్రదేశంలో నిర్మించారు. దీంతో డ్రైనేజీ సౌకర్యం లేక గ్రామంలో వాడుక నీరు సబ్ స్టేషన్ సమీపంలోనే నిల్వ ఉంటున్నది. వర్షాలు లేనప్పుడు ఇక్కడ మురుగు నిలిచి ఉండేది. మొంథా తుఫాన్ వర్షాల దాటికి వర్షపు నీటితో పాటు భూమిలో నుంచి ఊటలు వచ్చి సబ్ స్టేషన్ ముడుకుల లోతు నీటిలో మునిగిపోయింది. గత మూడు రోజులుగా విద్యుత్ సిబ్బంది మోటార్లతో నిల్వ నీటిని పైకి తోడుతునప్పటికీ ఊటల కారణంగా క్షణాల్లో నిండిపోతోంది. దీంతో ఏం చేయాలో అర్థ కాక ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. వారితో పాటు వినియోగదారులు ముడుకుల లోతు నీటిలో నుంచే వచ్చిపోతున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


ముడుకుల లోతు నీటిలో నుంచి వస్తున్న సిబ్బంది

ఘనంగా సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి

రావికమతం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కొత్తకోట సీఐ జి.కోటేశ్వరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా దివాస్ రన్ ఫర్ యూనిటీ సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో నాలుగు పోలీస్ స్టేషన్ల సిబ్బందితో కలసి ఆయన నాలుగు కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ పటేల్ ఉక్కు మనిషన్నారు. బ్రిటీష్ వారు దేశ భద్రతను ప్రమాదకరమైన స్థితిలోకి నెట్టేసి విడిచి వెళ్లారన్నారు. అటువంటి పరిస్థితుల్లో సర్దార్ పటేల్ దేశానంతటిని ఒకే తాటి పైకి తీసుకొచ్చారన్నారు. ఆ మహనీయుడి అడుగు జాడల్లోనే అంతా నడుద్దామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలాల ఎస్ఐలు ఎం.శ్రీనివాస్, ఎం.రఘువర్మ, కృష్ణారావు, భాస్కరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రావికమతంలో ర్యాలీ చేస్తున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, పోలీసులు

మాడుగులలో...

మాడుగుల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత దేశంలో పటేల్ స్వదేశీ సంస్థానాలను విలీనం చేశారన్నారు. ఈ తీరును విద్యార్థులకు వారు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.జయలక్ష్మి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్దార్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీరంరెడ్డి సూర్యనారాయణ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రినాయుడు, అడిగర్ల రాంబాబు, బాబూరావు, జమీలు, అంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిన్న అలా.. నేడు ఇలా


నిన్న బురద నీరులో ఉన్న శివాలయం


నేడు పరిశుభ్రంగా ఉన్న శివాలయం

» నీట మునిగిన పైడిపాల శివాలయం

» శుభ్రం చేసిన భక్తులు

» శుక్రవారం యథావిధిగా కార్తీక పూజలు

మాకవరపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):
మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో మండలంలోని పైడిపాల జంక్షన్‌లోని వామలింగేశ్వర ఆలయం నీట మునిగింది. శివాలయంలో ఉన్న నంది విగ్రహంతో పాటు గర్భగుడిలో ఉన్న శివలింగం కూడా నీరు చేరింది. దీంతో భక్తులు తీవ్ర ఆందోళన చెందారు. తుఫాన్ తీరం దాటడంతో భక్తులు ఆలయంలో ఉన్న నీరు బయటకు పోయేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం ఆలయాన్ని పరిశుభ్రం చేశారు. దీంతో శుక్రవారం వామలింగేశ్వర దేవాలయంలో కార్తీకమాసం పూజలు యథావిధిగా కొనసాగాయి.

బాలల పాఠవ పోటీలకు మంచి స్పందన

నర్సీపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి బాలల ప్రతిభా పాఠశ పోటీలకు విశేష స్పందన లభించింది. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మునిసిపల్ కమిషనర్ సురేంద్ర శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించిన పోటీలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 300 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు, రమేశ్, అల్లు అప్పారావు, ఆళ్ళ వరప్రసాద్, బాబీ మాస్టారు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పెద్దేరు ఉధృతి

» వడ్డాది కాజ్‌వే పైనుంచి పారుతున్న వరద నీరు

» నిలిచిపోయిన వాహనాల రాకపోకు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి):
తుఫాన్ వర్షాలు తగ్గినప్పటికీ మండలంలోని వడ్డాది వద్ద పెద్దేరు నది కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం నాటికి కూడా ఉధృతి తగ్గలేదు. వరద నీటి ఉధృతికి కాజ్‌వే కొంత మేరకు రాళ్లు, కాంక్రీట్ కొట్టుకుపోయింది. కుంగిన పాత వంతెనపై పెద్ద వాహనాలకు అనుమతి లేకపోవడంతో కాజ్‌వే పైనుంచి వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కాజ్‌వే పైనుంచి నీటి ఉధృతి తగ్గిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


వడ్డాది కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఇందిరాగాంధీకి ఘన నివాళులు


ఇందిరాగాంధీకి నివాళులు అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, నాయకులు

నర్సీపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా గాంధీ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న రామారావుపేటలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ ప్రధానిగా బ్యాంకులు జాతీకరణ వంటి ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నంగిన రమణ, సిద్ధ, శివ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేలో తప్పులు సరిచేయండి


సర్వేలో తప్పులను తహశీల్దార్‌కు వివరిస్తున్న నాయకులు

మాకవరపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో భూముల రీ సర్వేలో అనేక తప్పులు జరిగాయని, వాటిని సరిచేయాలని కొండలఅగ్రహారం, నారాయణరాజుపేట గ్రామాలకు చెందిన నాయకులు తహశీల్దార్‌ను కోరారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌.పై.పాత్రుడు ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రుడు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో సర్వే పూర్తయినప్పటికీ ఇంకా కొందరు రైతుల భూములు సర్వే చేయకుండా ఉండిపోయాయన్నారు. అలాగే సర్వేలో కొంత మంది రైతుల భూములు ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయని చెప్పారు. జిరాయితీ భూములు ప్రభుత్వ భూములు సర్వే చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ మరలా వెంటనే సర్వే చేసి సరిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, గిరిబాబు, శంకరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు

రావికమతం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని మత్సవానిపాలెం గ్రామంలో శుక్రవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంత పంటల్లో నీరు నిల్వ ఉందన్నారు. దాన్ని త్వరితగతిన బయటకు పోయేలా దృష్టి పెట్టాలన్నారు. పంటలు సాగు చేసే ప్రతీ రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి కోరారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సౌజన్య, ఎన్.సత్తిబాబు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

వరికి తెగుళ్ల బెడద

రోలుగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు తెగుళ్ల బెడద అధికంగా ఉందని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. రోలుగుంట, కొవ్వూరు గ్రామాల్లో శుక్రవారం వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అగ్గి తెగులు, ఆకుముడత పురుగ, పోటాష్ లోపం కనిపిస్తున్నాయని చెప్పారు. అగ్గి తెగులు సోకిన పంటలకు ట్రైసైక్లోజోలు 120 గ్రాములు, ఆకుముడత తెగుళ్లకు క్లొరైఫైరిపోస్ 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. చిరు పొట్ట దశలో తప్పనిసరిగా ఎకరానికి 20-30 కిలోల యూరియా, 20-25 కిలోల పొటాష్‌తో కలిపి వేయాలన్నారు. వీఏఏ ఎన్.రాజేశ్వరి పాల్గొన్నారు.

పంటలను సంరక్షించుకోవాలి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులు తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టి వరి పంటను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయధికారి భాస్కరరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ తాకిడికి కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న అప్పన్నపాలెంలో 98 ఎకరాలు, గంటికొర్లంలో 57 ఎకరాలు, భట్లోవలో ఏడు ఎకరాలు, నిమ్మలోవలో 92 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు చెప్పారు. రైతులు నేలకొరిగిన వరి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించినట్టు చెప్పారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గొలుగొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి ప్రసాద్ సూచించారు. మండలంలోని గుండుపాల, పాకలపాడు, చీడిగుమ్మల గ్రామాల్లో పశు వైద్య సంచార వాహనం ద్వారా శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో సదస్సులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులను తేమ లేకుండా ఉన్న ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు శిరీషా, సురేశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

నాతవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు గొలుగొండపేట గ్రామంలో పారిశుధ్యంపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంలో ఎక్కడికక్కడ చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నట్టు ఎంపీడీవో సత్యశ్రీనివాసు తెలిపారు. అలాగే కాలువల్లో ఎప్పటికప్పుడు మురుగును పంచాయతీ కార్యదర్శుల ద్వారా తొలగించడమే కాకుండా వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ జల్లుతున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. పశువుల ఆసుపత్రి, సచివాలయం సమీపాల్లో భారీగా వరద నీరు చేరడంతో చెరువు మాదిరిగా తయారయ్యాయి. ఎంపీడీవో శివప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఈ నీటిని కాలువల ద్వారా బయటకు తరలించారు. అనంతరం కశింకోట-బంగారుమెట్ట రోడ్డులో వాహన చోదకులకు ఇబ్బదులు లేకుండా ఎక్స్‌కవేటర్‌తో కంకర రాళ్లను వేయించి గోతులను పూడ్చించారు. అలాగే రహదారిపై నీరు నిల్వ లేకుండా కాలువలు తీయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నుంకర లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు దొంకిన అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి సీరా అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

గొలుగొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకలపాడు గ్రామంలో బెల్టు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలకు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేయగా, ఏడు మద్యం సీసాలతో వి.అర్జున్ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో తుఫాన్ బాధితులకు ఆసరా

మాడుగుల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునరావాస కేంద్రాల్లో తుఫాన్ బాధితులకు ఆసరా కల్పిస్తున్నామని తహశీల్దారు రమాదేవి తెలిపారు. అజయపురం, మామిడిపాలెం, పునువుల బంద, డి.గొటివాడ, శంకరం తదితర గ్రామాల్లోని 28 కుటుంబాలకు సంబంధించి 55 మందిని ఐదు పునరావాస కేంద్రాల్లో ఉంచి తగిన సదుపాయాలు కల్పించామన్నారు. వీరికి తుఫాన్ సాయంగా ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కిలో చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార అందిస్తున్నామని చెప్పారు. అలాగే కుటుంబంలో ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున గరిష్ఠంగా రూ. మూడు వేలు ఆర్థిక సాయంగా అందిస్తున్నామన్నారు. ఈ నగదు వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నట్టు తహసీల్దారు తెలిపారు.

సఖీ సురక్ష వైద్య శిబిరం

నర్సీపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో సఖీ సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. పెదబొడ్డేపల్లి మునిసిపల్ కార్యాలయం, నర్సీపట్నం పాత మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో 685 మంది మహిళలకు బీపీ, చక్కెర, గుండె, క్యాన్సర్‌కి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సఖీ సురక్ష డాక్టర్ రాజ్యలక్ష్మి, కమిషనర్ సురేంద్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి, ఏవో ఆశాలత, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి రెండు కిలోల వెండి కిరీటం



వెంకటేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవికి వెండి కిరీటాలు అలంకరించిన దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి కొత్త బయపురెడ్డిపాలెంలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామికి రెండు కిలోల వెండితో కిరీటాలు, కర్ణ పత్రాల అలంకరణ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నర్సీపట్నం శారదానగర్‌కి చెందిన కొల్లూరి శ్రీనివాసశర్మ, అహ్మదాబాద్‌కి చెందిన భవేష్ భాయ్‌సావలియా సంయుక్తంగా విరాళంగా ఇచ్చిన కిలో వెండితో స్వామి వారికి కిరీటం చేయించారు. కొత్త బయపురెడ్డిపాలెం, నర్సీపట్నంకి చెందిన పలువురు భక్తులు విరాళంగా ఇచ్చిన కిలో వెండితో శ్రీదేవి, భూదేవిలకు వెండి కిరీటాలు చేయించి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు బయపురెడ్డి అప్పలనాయుడు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

» హోం మంత్రి వంగలపూడి అనిత



మహిళతో మాట్లాడుతున్న మంత్రి అనిత

ఎస్.రాయవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడమే కాకుండా ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగామని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతమైన బంగారమ్మపాలెం గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు పలువురి ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుటుందని హామీ ఇచ్చారు. మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులతోపాటు ఇతర కులాల వారికి కూడా తుఫాన్ సహాయం అందిస్తామని తెలిపారు. పూరిళ్లు దెబ్బతిన్న బొంది మసేనమ్మ, వడిపిల రాజమ్మతోపాటు ఐదేళ్ల క్రితం సముద్రంలో వేటకు వెళ్లిన భర్తను కోల్పోయిన మైలపల్లి సత్తియ్యమ్మకు ఆర్థిక సాయం అందజేశారు. వీరితోపాటు తుఫాన్ ప్రభావంతో ఇళ్లు దెబ్బతిన్న వారికి వెంటనే పక్కా గృహాలు మంజూరు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాగా ఎన్ఏవోబీలో వరహా నదికి అడ్డంగా గోడ నిర్మించడం వల్ల ఎగువ నుంచి వచ్చే వరద నీరు గ్రామంలోకి వస్తున్నదని, ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. అనంతరం తుఫాన్ బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరుకులను ఆమె పంపిణీ చేశారు. మంత్రి పర్యటనలో టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు ఎస్.వెంకటరాజు, తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, అల్లు నరసింహమూర్తి, కోడ లోవరాజు, మాధవ్, పల్లెల జగ్గారావు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్ఫూర్తితో పనిచేయాలి

» విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి

» ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్ఫూర్తితో పోలీస్ సిబ్బంది పని చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి సూచించారు. రేంజ్ పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవంలో ఆయన పాల్గొని వల్లభ్‌భాయ్‌పటేల్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను భారతలో విలీనం చేయడానికి పటేల్ పోషించిన పాత్ర దేశ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. దేశ సమైక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి పటేల్ అని కొనియాడారు.

రిజర్వాయర్లకు తగ్గిన వరద

... 5వ పేజీ తరువాయి

నష్టం వుండకపోవచ్చని రైతులు అంటున్నారు.

శాంతించిన శారదా నది

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది శుక్రవారం కొంతమేర శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడడంతోపాటు రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో వరద నీటిని విడుదల చేయడంతో శారదా నది ఉధృతంగా ప్రవహించిన విషయం తెలిసిందే. అనకాపల్లి వద్ద నదిని ఆనుకొని ఉన్న ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోకి వరదనీరు చొచ్చుకు వచ్చింది. అయితే గురువారం రాత్రి నుంచి వర్షం పడకపోవడం, రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల తగ్గిపోవడంతో శారదా నదిలో వరద ప్రవాహం క్రమేపీ తగ్గుముఖం పడుతున్నది.

జలాశయాలకు తగ్గిన వరద పోటు

పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జిల్లాలోని జలాశయాల్లోకి వరద పోటు తగ్గింది. గురువారంతో పోలిస్తే శుక్రవారం పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ జలాశయాల నుంచి నీటి విడుదలను తగ్గించగా.. రైవాడ గేట్లు మూసివేశారు.



నిండు కుండలా ఉన్న కోనాం జలాశయం

పెద్దేరు నుంచి 700 క్యూసెక్కులు...

మాడుగుల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు జలాశయానికి వరద తాకిడి స్వల్పంగా తగ్గింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా శుక్రవారం ఉదయం 620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 134.25 మీటర్లకి చేరింది. అధికారులు జలాశయం మూడో గేటు ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

కోనాం నుంచి 300 క్యూసెక్కులు..

చీడికాడ: మండలంలో కోనాం జలాశయంలోకి శుక్రవారం కూడా వరద కొనసాగింది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా 300 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ఇంతేమొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో నీటిమట్టం 98.8 మీటర్ల వద్ద స్థిరంగా వుంది.

కల్యాణపులోవకు 280 క్యూసెక్కులు..

రావికమతం: మండలంలో కల్యాణపులోవ జలాశయానికి వరద కొనసాగుతున్నది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా శుక్రవారం 280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుంది. మూడు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 459.02 అడుగుల వద్ద నీటిమట్టం వుంది.

రైవాడ గేట్లు మూసివేత

దేవరాపల్లి: మండలంలోని రైవాడ జలాశయం గేట్లను శుక్రవారం సాయంత్రం మూసివేసినట్టు జలవనరుల శాఖ డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. గురువారం వరకు వరద నీరు జలాశయంలోకి చేరుతుండడంతో మూడు గేట్లు ద్వారా నీరు విడుదల చేశామన్నారు. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా.. ప్రస్తుతం 112 మీటర్లు ఉండడంతో గేట్లను మూసివేసినట్టు ఆయన తెలిపారు. ఆయకట్టుకు 50 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

వైద్యుడి వక్రబుద్ధి

» ఏఎంసీ పరిధిలోని ఓ బోధనాస్పత్రిలో ఉన్నతాధికారి అడ్డగోలు వ్యవహారాలు

విశాఖపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాల (ఏఎంసీ) పరిధిలోని ఒక బోధనాస్పత్రి ఉన్నతాధికారి వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన ఆస్పత్రిలో పనిచేసే మహిళా వైద్యులు, పీజీ విద్యార్థినులు, నర్సింగ్ సిబ్బందితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే అభియోగాలు ఉన్నాయి. ఈ తరహా ఆరోపణలు చాలాకాలంగా ఉన్నప్పటికీ ఆయనపై ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బాధితులు పలువురు విజయవాడలోని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) కార్యాలయానికి ఫిర్యాదు చేసినా అవి బుట్టదాఖలు అవుతున్నాయి. వారం క్రితం కూడా ఈ వైద్యాధికారి ఆస్పత్రిలో ఓపీ విభాగం నుంచి సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఓ వైద్య విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించబోయారు. ఈ ఆకస్మిక పరిణామానికి భయపడిన ఆమె పెద్దగా కేకలు వేశారు. ఓపీలో ఉన్నవారంతా పరుగెత్తుకు వచ్చారు. 'ఏమీ లేదు...అంతా వెళ్లిపోండి' అంటూ ఆయన వారిని వెనక్కి పంపేశారు. ఈ ఘటనపై కొందరు సీఎం కార్యాలయానికి, డీఎంఈకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీనిపై రహస్య విచారణ జరుగుతున్నట్టు సమాచారం.

తొలి నుంచి అదే తీరు..

ఇంకా ఆరేడేళ్ల సర్వీస్ ఉన్న ఈ సీనియర్ వైద్యుడు మెడిసిన్ చదువుతున్నప్పటి నుంచే ఇలాంటి వ్యవహారాలు ఎక్కువ నడిపేవాడని సహాధ్యాయులు చెబుతున్నారు. అమ్మాయిలను దక్కించుకునేందుకు తొలుత అధికారాన్ని ఉపయోగిస్తాడని, అప్పటికీ దారిలోకి రాకపోతే డబ్బు ఆశ చూపిస్తాడని తెలిసింది. తాను విధులు నిర్వర్తిస్తున్న కార్యాలయంలోనే అనేకసార్లు అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డారని సిబ్బంది చెబుతున్నారు. ఆయన వద్దకు మహిళా రోగులు వస్తే...పరీక్ష పేరుతో శరీరంపై ఇష్టానుసారం చేతులు వేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

బంధువులు పెద్ద స్థానంలో ఉన్నారని ధీమా

పోలీస్ శాఖలో, ఏసీబీలో ఆయన బంధువులు ఉన్నారు. దాంతో తనపై ఎవరు ఫిర్యాదు చేసినా ఏమీ కాదనే ధైర్యంతోనే లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ప్రచారం ఉంది. తన వాంఛలు తీర్చుకునేందుకు ఎవరూ లభించనప్పుడు బయట కాల్‌గర్ల్స్‌ని కూడా బుక్ చేసుకుంటారని, వారిని నగరంలోని స్టార్ హోటళ్లకు తీసుకువెళతారని తెలిసింది. తాజాగా వారం క్రితం ఓ స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేసుకొని ఓ మహిళను తీసుకువెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కీచక వైద్యాధికారిపై విచారణ చేసి, తగిన చర్యలు చేపట్టాలని వైద్య విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.

పుస్తక మహోత్సవం ప్రారంభం

» ఏడో తేదీ వరకు నిర్వహణ



ఒక బుక్ స్టాల్‌లో పుస్తక ప్రేమికులు. (ఇన్‌సెట్‌లో) పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న బుచ్చిరాజు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం అనకాపల్లి పుస్తక మహోత్సవం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కొరుకొండ బుచ్చిరాజు ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా ట్రెజరీ అధికారి వీఎల్ సుభాషిణి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి హాజరయ్యారు. నవంబరు ఏడో తేదీ వరకు ఉదయం పది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పుస్తక మహోత్సవం ఉంటుందని ఉత్సవ్ కన్వీనర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. వందకుపైగా ప్రచురణకర్తల పుస్తకాలు ప్రదర్శనలో ఉన్నాయన్నారు. ఒకటో తేదీ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఐదు, ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు సోలో క్లాసికల్ డ్యాన్సు, బృందంగా దేశభక్తి గీతాలాపన, బృందంగా జానపద నృత్యప్రదర్శన, విచిత్ర వేషధారణ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు త్రిమూర్తులురెడ్డి, సాహితీమిత్రుల సంఘం తరపున కె.అప్పలరాజు, రంగబాబు, పద్యకవితా సదస్సు నుంచి మాధవీ సనారా, ఎం.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాశ్ పాల్గొన్నారు.

ముంపులోనే పొలాలు

... 5వ పేజీ తరువాయి

నదుల్లో ప్రవాహ ఉధృతి తగ్గినప్పటికీ, లోతట్టు ప్రాంతాల్లోని పొలాల్లో నుంచి వరద నీరు చాలా నెమ్మదిగా బయటకు పోతున్నది. మండలంలోని కన్నంపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం, సింహాద్రిపురం, నరసయ్యపేట, అంకుపాలెం తదితర పంచాయతీల్లో వరి, చెరకు పంటలు శుక్రవారం కూడా నీటి ముంపులోనే ఉన్నాయి. శనివారం సాయంత్రానికి పొలాల్లోని నీరు బయటకు పోయే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. అయితే మూడు రోజులకుపైగా వరి పొలాలు నీటిముంపులో ఉండడంతో ఎంత మేర నష్టం వాటిల్లుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

జలదిగ్బంధంలో పూడిమడక

అచ్యుతాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు పొంగడంతో పూడిమడక జలదిగ్బంధంలో చిక్కుకుంది. తుఫాన్ ప్రభావం తగ్గి రెండు రోజులు దాటినప్పటికీ వరద ముంపు నుంచి గ్రామం బయటపడలేదు. వరుసగా మూడో రోజు కూడా ముంపులోనే వుంది. మంగళవారం ఉప్పుటేరు పొంగి పూడిమడక చుట్టూ ఉన్న ఉప్పుగల్లీలు ముంపునకు గురయ్యాయి. శుక్రవారం సాయంత్రానికి కూడా ఉప్పుగల్లీల్లో నీరు తగ్గలేదు. సముద్ర అల్లకల్లోలంగా ఉండి తీరంలో భారీగా అలలు ఎగిసిపడడమే కారణమని మత్స్యకారులు చెబుతున్నారు. కాగా పల్లపు ప్రాంతాలైన తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగన్నపేటల్లో వరి, చెరకు పొలాల్లో రెండు, మూడు అడుగుల లోతున నీరు నిలిచింది. కొన్నిచోట్ల వరి ఆకుల చివర్లు కూడా కనిపించనంతగా మునిగిపోయింది. శనివారం కూడా పరిస్థితి ఇదే విధంగా వుంటే వరిపైరు కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

2 వేల హెక్టార్లలో పంట నష్టం

... 5వ పేజీ తరువాయి

సిద్ధం చేశారని చెప్పారు. తుఫాన్ సమయంలో జిల్లాలో ఎక్కడా ప్రాణనష్టం వాటిల్లకుండా కలెక్టర్ విజయకృష్ణన్, ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారని అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తుఫాన్ మొదలైన రోజు నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ, సహాయ పునరావాస కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించారని అన్నారు. మంత్రితోపాటు ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. వీరి వెంట కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, ఏపీఎస్ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, కూటమి నాయకులు ధూళి రంగనాయకులు, లాలం భరత్, వి.దినేష్‌బాబు, పప్పల నూకన్నదొర, తదితరులు వున్నారు.



నారాయణపురం వద్ద ఇసుకను బస్తాల్లో నింపుతున్న కూలీలు



రాంబిల్లి మండలం రజాల వద్ద ముంపులో ఉన్న వరి పొలాలు

సాయి శ్రేయాస్‌కు మళ్లీ అనుమతులు!

... 5వ పేజీ తరువాయి

చేశారు. జూన్ 11న ప్రమాదం జరిగితే 75 రోజులు దాటిన తరువాత (అప్పటికే అన్ని ఆనవాళ్లు నాశనమైపోయాయి) తీరుబడిగా ఆగస్టు 27న జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీని వేశారు. అధికారుల హోదాలకు అనుగుణంగా కమిటీలో స్థానం కల్పించారు. కానీ ఆ రంగంలో నైపుణ్యం కలిగినవారే కారణాలు గుర్తించగలరనే విషయం విస్మరించారు. దీనినే మానవ హక్కుల వేదిక తప్పుబట్టింది. నలుగురు సభ్యులు కలిగిన ఇన్‌స్పెక్షన్ కమిటీ సెప్టెంబరు ఒకటో తేదీన కంపెనీ ప్రాంగణాన్ని సందర్శించి అన్నీ పరిశీలించింది. ఆ మరుసటిరోజు నివేదిక తయారుచేసి అందించింది.

విషవాయువులు పీల్చడం వల్లనే మరణాలు

ఎఫులియెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో వ్యర్థాలను న్యూట్రలైజేషన్ చేస్తుండగా పరిశీలనకు వెళ్లిన ఇద్దరు భద్రతా విభాగం ఉద్యోగులు ట్యాంకు మ్యాన్‌హోల్ నుంచి వచ్చిన విషవాయువులు (సల్ఫ్యూరిక్ యాసిడ్, అమోనియా, ఓలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్) పీల్చడం వల్లనే మరణించారని ఇన్‌స్పెక్షన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా కంపెనీకి కొన్ని సూచనలు చేసింది.

● కంపెనీలో ఇంకా 80 కిలోలీటర్ల ఎఫులియెంట్ స్టోరేజ్ ట్యాంకులో ఉంది. దానిని వెంటనే బయటకు తరలించాలి.

● ఎఫులియెంట్ స్టోరేజీ ట్యాంక్ ప్రాంతంలో వాయువులను గుర్తించే పరికరాలు ఏర్పాటుచేయాలి.

● ప్రామాణిక ఆపరేషన్ విధానాలు (ఎస్‌ఓపీ) పాటించాలి.

● ఎఫులియెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు అనుసంధానం చేసిన స్క్రబ్బర్‌కు ప్రత్యేకంగా విద్యుత్ మీటర్ ఏర్పాటుచేసి, వాటి రీడింగ్ ప్రతి నెలా కాలుష్య నియంత్రణ మండలికి పంపాలి.

హెచ్‌ఆర్‌ఎఫ్ అభ్యంతరాలు

జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ లోపాలను బహిర్గతం చేయలేదని హెచ్‌ఆర్‌ఎఫ్ ఆరోపించింది. కంపెనీలో అంతర్గత భద్రత వైఫల్యాల వల్లే ఈ ప్రమాదం జరిగిందని, దానిని నిర్ధారించలేదని పేర్కొంది. కంపెనీలో స్క్రబ్బింగ్ విధానం లోపభూయిష్టంగా ఉన్నా దానిని తప్పుపట్టలేదని కూడా విశ్లేషించింది. నిర్వహణ లోపాలు, భద్రతా వైఫల్యాలు, నియంత్రణ అంశాలను విస్మరించిందని పేర్కొంది. ఇకపై ఏదైనా ప్రమాదం జరిగితే 48 గంటల్లో కమిటీని వేయాలని డిమాండ్ చేసింది. ఈ ప్రమాదాన్ని గుణపాఠంగా తీసుకుని రాష్ట్రంలో యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ ట్రైనింగ్ ప్రవేశపెట్టాలని సూచించింది.

క్రైం... crime news

కడుపు నొప్పి తాళలేక నవ వధువు ఆత్మహత్య

నర్సీపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక నవ వధువు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.

నర్సీపట్నం మునిసిపాలిటీలోని 26వ వార్డు గంగాధర్ వీధిలో నివాసం ఉంటున్న కర్రి పద్మావతి చిన్న కూతురు షర్మిళకు హైదరాబాద్‌కి చెందిన పైన గురుమూర్తితో ఆగస్టులో వివాహం జరిగింది. ఇటీవల షర్మిళ హైదరాబాద్ నుంచి పుట్టింటికి నర్సీపట్నం వచ్చింది. గురువారం సాయంత్రం కర్రి పద్మావతి ఇంట్లో లేని సమయంలో షర్మిళ ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కడుపు నొప్పి భరించ లేక షర్మిళ బలన్మరణానికి పాల్పడిందని తల్లి పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి

కె.కోటపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గెడ్డలో పడి కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం చౌడువాడకు సమీపంలోని రాపేటివారి కల్లాల వద్ద తుప్పల్లో శుక్రవారం లభ్యమైంది. మండలంలోని చౌడువాడకు చెందిన బంటు అప్పలనాయుడు (32) మంగళవారం పశువుల మేత కోసం చిట్టిగెడ్డ వద్దకు తీసుకువెళ్లాడు. అప్పటికే గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదవశాత్తు గెడ్డలో అప్పలనాయుడు కొట్టుకుపోయాడు. పశువులను మేత కోసం తీసుకువెళ్లిన తన కుమారుడు ఇంటికి చేరకపోవడంతో తల్లి గౌరమ్మ బుధవారం పోలీసులకు సమాచారం అందించింది. శారదా రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో ప్రవాహం పెరిగింది. దీంతో నదిలో దిగడానికి ఎవరు సాహసించలేకపోయారు. స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం నది వద్దకు చేరి చుట్టు పక్కల గాలించిన మృతదేహం లభ్యం కాలేదు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున నీటి ఉధృతి తగ్గడంతో రాపేటి కల్లాల వద్ద తుప్పల్లో మృతదేహం లభ్యమైంది. చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటపాడు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. అప్పలనాయుడుకు తల్లి గౌరమ్మ, భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బొగ్గు లారీ బోల్తా

పరవాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయంభూవరం వద్ద బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. గంగవరం పోర్టు నుంచి పెదగంట్యాడ మండలం పాలవలస వద్దగల హిందూజా పవర్‌ప్లాంట్‌కు బొగ్గు లోడుతో బయలుదేరిన లారీ గురువారం అర్ధరాత్రి కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరం దుర్గమాంబ ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ రంజిత్‌కుమార్ యాదవ్‌కు క్షేమంగా బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

70 కిలోల గంజాయి పట్టివేత

» ఆరుగురి అరెస్టు, ఆటో సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుకున్న నిందితులతో డీఎస్పీ శ్రావణి, సీఐ స్వామినాయుడు, పోలీసులు

కశింకోట, అక్టోబర్ 31 (ఆంధ్ర జ్యోతి): ఏజెన్సీ నుంచి గంజాయిని ఆటోలో కశింకోటకు తీసుకు వస్తుం డగా పోలీసులు దాడి చేసిపట్టు కున్నారు. 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబం ధించి అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, కశింకోట సీఐ అల్లుస్వామినాయుడు శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లా చెందిన కుమార్ గంజాయి వ్యాపారం చేస్తుంటాడు. ఇతను అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం బొడ్డేలగొంది గ్రామానికి చెందిన కొర్రా సత్తిబాబు, వంచుల పంచాయతీ యల్లవరం గ్రామానికి చెందిన పాంగి ధర్మరాజు, చింతపల్లి మండలం బలపం పంచాయతీ కొప్పుగొంది గ్రామానికి చెందిన కొర్రా బొంజిబాబు, నీరుతోటపాలెం గ్రామానికి సిందేరి జక్రయ్యలతో గంజాయి కొనుగోలు చేయిస్తుంటాడు. గంజాయిని అక్కడి నుంచి వివిధ మార్గాల్లో అనకాపల్లి జిల్లా కశింకోటకు తరలిస్తుంటాడు. ఇక్కడకు చేర్చిన తరువాత దీనిని భద్రపరిచే బాధ్యతను జగనన్న కాలనీకి చెందిన సేనాపతి మాణిక్యానికి అప్పగించాడు. కుమార్ కశింకోట నుంచి గంజాయిని తమిళనాడుకు తీసుకెళుతుంటాడు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయితో ఒక ఆటో కశింకోటకు వస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. కొద్దిసేపటికి అటుగా వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా 35 గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. రెవెన్యూ సిబ్బంది సమక్షంలో తూకం వేసి 70 కిలోల గంజాయి వున్నట్టు నిర్ధారించారు. మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం జెర్రిల గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి, కశింకోట తీసుకువస్తున్నట్టు నిందితులు వెల్లడించారు. ఆటోను సీజ్ చేసి, ఏడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి నిందితుడికి పదేళ్లు జైలు శిక్ష

అనంతగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుడికి పదేళ్లు జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారని స్థానిక ఎస్ఐ డీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. 2021 సంవత్సరంలో అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి లారీలో 37 బస్తాల్లో 620 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అటుటాడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రాజును అప్పటి ఎస్ఐ కె.రాము అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం చోడవరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.హరినారాయణ రాజుకు పదేళ్లు జైలు శిక్ష, రూ.లక్ష రూపాయల జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. గంజాయి కేసుతో సంబంధం ఉన్న ఏ1 పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మునగపాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఒక మహిళ మృతిచెందింది. ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో మడకపాలెం గ్రామానికి చెందిన లగిశెట్టి సన్యాసమ్మ(55) శుక్రవారం ఉదయం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కింద పడి ఉన్న విద్యుత్ వైర్‌ను గమనించక దానిపై కాలు వేశారు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె కుమారుడు సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574